11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 39 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 21 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 39 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 21 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# చిన్న ఆలోచనలే ఒక్కోసారి గొప్ప అభివృదికి బాటలు వేస్తాయి

- అనకాపల్లిలో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలుకు నిర్ణయం
- వ్యక్తిగత శుభ్రత, ఆత్మవిశ్వాసం పెంచడమే కార్యక్రమ లక్ష్యం
- పార్వతీపురం మన్యం కలెక్టర్ ఆలోచనను ప్రశంసించిన ముఖ్యమంత్రి
- త్వరలో 75 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటన



పెన్ పవర్ డెస్క్:చిన్న చిన్న ఆలోచనలు ఒక్కోసారి అభివృద్ధికి, గొప్ప మార్పులకు బాటలు వేస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొన్ని ఆలోచనలు సమాజంలో విప్లవాత్మక మార్పులు తెస్తాయని, 'ముస్తాబు' అలాంటి కార్యక్రమమేనని తెలిపారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ముస్తాబు' కార్యక్రమాన్ని ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ముస్తాబు కార్నర్'ను సీఎం పరిశీలించి, విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమం నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు కానుందని చంద్రబాబు ప్రకటించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఒక అధికారి చొరవతో మొదలైన మంచి పనిని రాష్ట్రమంతటా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "విద్యార్థుల్లో వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. పాఠశాలకు చక్కటి యూనిఫాంతో, పరిశుభ్రంగా రావాలి. చక్కగా తల దువ్వుకోవడం, భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవడం వంటి మంచి అలవాట్ల వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఈ ముస్తాబు కార్యక్రమానికి అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. దీనివల్ల

వివరాలు 2లో..



## జగన్ బర్త్‌డే ఫ్లెక్సీలో కేసీఆర్, కేటీఆర్..

- తాడేపల్లిలో వైరల్ అవుతున్న కటౌట్!
- నేడు వైసీపీ అధినేత జగన్ పుట్టినరోజు
- సమరశంఖం పూరిస్తున్న జగన్‌తో పాటు కేసీఆర్, కేటీఆర్ చిత్రాలు

పెన్ పవర్ డెస్క్:అధికారం పోయినప్పటికీ చెక్కుచెదరని స్నేహంవైసీపీ అధినేత జగన్ నేడు పుట్టినరో జును జరుపుకోబోతున్నారు. ఈ సందర్భం గా ఆయన నివాసం

వివరాలు 2లో..

## మీ చాప్టర్ క్లోజ్... జగన్ రెడ్డి ఇంకా భ్రమలోనే బతుకుతున్నారు



- పీపీపీపై జగన్‌ది ద్వంద్వ వైఖరని మంత్రి సవిత విమర్శ
- ఢిల్లీలో ఎంపీల మద్దతు, ఇక్కడ గల్లీ రాజకీయాలని ఎద్దేవా
- కోడి కత్తి, గులకరాయి డ్రామాల్లాగే సంతకాల డ్రామా అని ఫైర్
- మెడికల్ కాలేజీలను పీపీపీలోనే పూర్తి చేస్తామని స్పష్టీకరణ
- అభివృద్ధికి అడ్డుపడితే రాష్ట్ర ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరిక

వివరాలు 2లో..




## పవనన్న చేసిన భగీరథ ప్రయత్నం ఫలించింది

- 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన పవన్ కల్యాణ్
- ఉభయ గోదావరి జిల్లాలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- పవన్ కల్యాణ్‌కు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అభినందనలు
- లోకేశ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చే దిశగా ముందడుగు వేసింది. ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కల్యాణ్ 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా ప్రజల దాహార్తి తీర్చడానికి కృషి చేయనున్నారు. ఈ కార్యక్రమంపై రాష్ట్ర ఐటీ, మానవ

వివరాలు 2లో..



# మీ చాప్టర్ క్లోజ్... జగన్ రెడ్డి ఇంకా భ్రమలోనే బతుకుతున్నారు

మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఇంకా పాత భ్రమల్లోనే బతుకుతున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు 'డైవర్షన్' రాజకీయాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల విషయంలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంపై వైసీపీది ద్వంద్వ వైఖరని, వారి ఎంపీలు ఢిల్లీలో మద్దతుగా సంతకాలు పెట్టి, ఇక్కడ గల్లీలో జగన్ డ్రామాలు ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. శనివారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. గతంలో కోడికత్తి, గులకరాయి డ్రామాలతో ప్రజలను మోసం చేసిన జగన్, ఇప్పుడు 'కోటి సంతకాలు' అంటూ కొత్త నాటకం మొదలుపెట్టారని సవిత ఎద్దేవా చేశారు. "ప్రజలు మీ నాటకాలను గ్రహించి, మిమ్మల్ని రాజకీయాల నుంచి డైవర్షన్ చేసి ఇంటికి పంపారు. చంద్రబాబు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మేం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం" అని ఆమె అన్నారు. 17 మెడికల్ కాలేజీలు తెచ్చానని గొప్పలు చెప్పుకుంటున్న జగన్, వాటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఖర్చు చేసింది సున్నా అని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన రూ.1,550 కోట్ల నిధులతోనే పనులు మొదలుపెట్టి మధ్యలో వదిలేశారని, దీనిపై త్వరలోనే ఆరోగ్య శాఖ మంత్రి పూర్తి లెక్కలతో వాస్తవాలు బయటపెడతారని తెలిపారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే పీపీపీ మోడల్‌లో మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని సవిత స్పష్టం చేశారు. "ప్రజలకు మంచి జరుగుతుంటే దానిపై కూడా విషం చిమ్మడం మీ దిగజారుడుతనానికి నిదర్శనం. పీపీపీ విధానం ఇతర రాష్ట్రాల్లో ఎలా విజయవంతమైందో మీకు తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నారు" అని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడం, ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాసి అప్పులు పుట్టకుండా చేయడం వంటి చర్యలతో జగన్ 'ఆంధ్రప్రదేశ్ ద్రోహి'గా మారుతున్నారని ఆమె హెచ్చరించారు. "మీ సొంత తల్లి, చెల్లి కూడా మిమ్మల్ని నమ్మని పరిస్థితి ఉందంటే మీ వ్యక్తిత్వం ఏంటో ప్రజలు అర్థం చేసుకున్నారు" అని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి సవిత వివరించారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు, మంత్రి లోకేశ్ విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకొస్తున్నారని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. "మీరు ప్రజావేదికను కూల్చి, పోలవరాన్ని పాడుబెట్టి, టిడ్కో ఇళ్లను గాలికి వదిలేశారు. కానీ మేము వాటిని పూర్తి చేసి ప్రజలకు అందిస్తున్నాం. ప్రజల సొమ్ముతో మొదలుపెట్టిన ఏ ప్రాజెక్టునైనా పూర్తి చేయాలన్నదే మా ప్రభుత్వ ధ్యేయం" అని అన్నారు. "ముప్పై ఏళ్లు నేనే సీఎం అని విర్రవీగిన మీకు, ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదంటే మీ పార్టీ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోండి. మీ చాప్టర్ క్లోజ్ అయిపోయింది. ఇప్పటికైనా భ్రమల నుంచి బయటకు వచ్చి, అభివృద్ధికి సలహాలు ఇవ్వండి. మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో పూర్తి చేసి తీరుతాం. పేదలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే మా లక్ష్యం" అని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## ఎడిటర్ వ్యూ

# జగన్ ఆ రిస్క్ తీసుకుంటారా? అందులో నిజమెంత?

వైసీపీ అధినేత జగన్ అనేక మంది నాయకులను వచ్చే ఎన్నికలలో పక్కన పెట్టేస్తారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా కొడాలి నాని, ఆర్కే రోజా, ఆళ్ల రామకృషా?రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విడదల రజని ఇలా అనేక మంది నేతలకు ఈ సారి నియోజకవర్గాలను మార్చడమో... లేక పక్కన పెట్టడమో చేస్తారన్న ప్రచారం ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తుంది. చాలా నియోజకవర్గాల్లో జగన్ సీనియర్ నేతలకు ప్రత్యామ్నాయంగా యువ నేతల కోసం చూస్తున్నారని అంటున్నారు. అందులో నిజమెంత అన్నది మాత్రం వైసీపీ నేతలు చెప్పకపోయినా.. 2029 ఎన్నికల్లో మాత్రం జగన్ అలాంటి సాహసం చేయకపోవచ్చున్న అభిప్రాయం మాత్రం బలంగా పార్టీ లోనే వినపడుతుంది.

**మొన్నటిఎన్నికల్లోనే...**

2024 ఎన్నికల్లోనే మంత్రులను, ముఖ్యమైన నేతలను నియోజకవర్గాలను మార్చి జగన్ చేతులు కాల్చుకున్నారు. ఈసారి కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నగిరి నియోజకవర్గానికి, ఆళ్ల రామకృషా?రెడ్డిని సత్తెనపల్లికి, విడదల రజనీని రేపల్లెకు పంపాలని దాదాపు డిసైడ్ అయ్యారన్న ప్రచారం ఉంది. ఇక ఆర్కే రోజాకు ఈసారి ఎక్కడా సీటు ఇవ్వకుండా అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీ ఇస్తారంటున్నారు. ఇందులో నిజం లేదని చెబుతున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆ యా నియోజకర్గాల్లో ఆ నేతలు విపరీతంగా పార్టీ కోసం పనిచేస్తున్నారు. కొత్త నాయకత్వం వస్తే మళ్లీ రెండు గ్రూపులవుతాయి. అందువల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పైగా ఈ నేతల వల్ల పార్టీకి నష్టమేమీ లేదని, అటువంటి వారిని ఎందుకు తప్పిస్తారన్న ప్రశ్న ఎదురవుతుంది.

**కావాలనే ప్రచారమా?**

వైసీపీని బద్నాం చేయడానికి కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దంటూ నేతలకు వైఎస్ జగన్ ఇటీవల వారికే స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గాల్లో కష్టపడి పనిచేయాలని, ప్రజాసమస్యలపై స్పందిస్తూ ఆందోళనకు దిగాలని జగన్ వారికి సూచించినట్లు సమాచారం. క్యాడర్ ను కూడా కాపాడుకుంటూ ప్రజల పక్షాన నిలస్తే టికెట్ అదే వస్తుందని జగన్ చెబుతుండటంతో వారికి భరోసా వస్తుందట. పెద్దిరెడ్డినే తీసుకుంటే ఆయన తన నియోజకవర్గమైన పుంగనూరును వదిలపెట్టి బయటకు వచ్చే ప్రసక్తి ఉండదని చెబుతున్నారు. అలాగే కొడాలి నానిని మించిన నేత గుడివాడలో దొరకడం కూడా వైసీపీకి కష్టమే అవుతుందని, అందువల్ల జగన్ ఆ రిస్క్ ఎందుకు తీసుకుంటారన్నది పార్టీ నేతల నుంచి వినిపిస్తున్నటాక్.

# మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేయాలో జగన్‌కు పక్కా ప్లాన్ ఉంది

వైసీపీ అధినేత జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎంత మేలు చేయాలో అంతా చేశారని, మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా ఆయనకు స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జరిగిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలు జగన్ వెంటే ఉంటారని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. "ప్రజలకు మేలు చేసేది జగన్ ఒక్కరేనని కోట్లాది మంది నమ్ముతున్నారు. అందుకే తన ఐదేళ్ల పాలనలో అందరికీ మేలు చేశారు. ఏదో ఆశించి ఆయన సహాయం చేయరు. తన వల్ల ప్రజలకు ఎంత మంచి జరుగుతుందనే నిత్యం ఆలోచిస్తారు" అని తెలిపారు. ఓదార్పు యాత్ర సమయంలోనూ, కరోనా కష్టకాలంలోనూ జగన్ ప్రజలకు అండగా నిలిచిన తీరును సజ్జల గుర్తుచేశారు. జగన్ ఏనాడూ పబ్లిసిటీ కోరుకోలేదని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కాలనీలు సృష్టించారని, 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రచారం చేసుకోలేదని అన్నారు. చంద్రబాబు తన 18 నెలల పాలనలోనే రూ.2.70 లక్షల కోట్లు అప్పు చేశారని, కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆర్థికవేత్తలే ఆశ్చర్యపోయేలా జగన్ తన ఐదేళ్ల పాలనను సాగించారని సజ్జల ప్రశంసించారు.

# అమరావతిలో జెన్ జీ పోస్టాఫీసు ప్రారంభించిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

ఇండియా పోస్టు ఆధునికీకరణ దిశగా మరో కీలక అడుగు పడింది. అమరావతిలోని వీఐటీ-ఏపీ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'జెన్ జెడ్' సబ్ పోస్టాఫీస్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా క్యాంపస్‌లలో పోస్టల్ వ్యవస్థను ఆధునీకరించే కార్యక్రమంలో భాగంగా ఈ కొత్త పోస్టాఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఙీ×ణ) సహకారంతో ప్రత్యేకంగా విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఈ పోస్టాఫీస్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ ఆధునిక సబ్ పోస్టాఫీస్ ద్వారా క్యాంపస్‌లోని వేలాది మంది విద్యార్థులకు వేగవంతమైన, సమగ్రమైన సేవలు అందుతాయని వివరించారు. కేవలం విద్యార్థులకే కాకుండా, దీని పరిధిలోని ఐదు బ్రాంచ్ పోస్టాఫీస్‌లకు కూడా ఇది సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. డిజిటల్ తరం అవసరాలకు అనుగుణంగా ఇండియా పోస్టును పునరావిష్కరించే ప్రయత్నంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ఇండియా పోస్టు నిబద్ధతను, ఆధునిక సేవలను ప్రతిబింబిస్తోందని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

# పవనన్న చేసిన భగీరథ ప్రయత్నం ఫలించింది

- మొదటి పేజీ తరువాయి

వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన జలాలు అందించేందుకు పవన్ చేసిన భగీరథ ప్రయత్నం ఫలించిందని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మరో హామీని నెరవేరుస్తున్న పవన్ కల్యాణ్‌కు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మంత్రి లోకేశ్ శుభాకాంక్షలపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నామని చెప్పారు. "ప్రజలందరికీ రోజుకు కనీసం 55 లీటర్ల సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యం లోని కూటమి ప్రభుత్వం ద్వారా, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రిగా ఈ అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఉభయ గోదావరి జిల్లాల ప్రజల దాహార్తి తీర్చే ఈ 'అమరజీవి జలధార ప్రాజెక్ట్' పట్ల అభినందనలు తెలియజేసినందుకు మిత్రుడు, సహచర మంత్రివర్యుడు నారా లోకేశ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గారిని నిరంతరం స్మరించుకునేలా మధ్యాహ్న భోజన పథకానికి నామకరణం చేసినందుకు, ఆవిడ జన్మించిన గోదావరి నేల నుంచి మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్ లో స్పందించారు.

# జగన్ బర్త్‌డే ఫ్లెక్సీలో కేసీఆర్, కేటీఆర్..

- మొదటి పేజీ తరువాయి

ఉండే తాడేపల్లిలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిలో ఓ కటౌట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ కటౌట్‌లో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన తనయుడు కేటీఆర్ కనిపించడమే దీనికి కారణం. జగన్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో జగన్ సమరశంఖం పూరిస్తుండగా, ఆయన వెనుక కేసీఆర్, కేటీఆర్ చిరునవ్వులు చిందిస్తున్నట్లుగా ఉంది. ఈ అనూహ్యమైన కాంబినేషన్ చూసిన స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. 2019లో జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కేసీఆర్‌తో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. చంద్రబాబు వీరికి ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి కావడంతో ఇరువురు నేతలు పలు సందర్భాల్లో ఒకరికొకరు సహకరించుకున్నారు. జగన్ ప్రమాణ స్వీకారానికి కేసీఆర్ హాజరుకావడం, ఇటీవలే కేసీఆర్‌కు హిప్ సర్జరీ జరిగినప్పుడు జగన్ స్వయంగా హైదరాబాద్ వెళ్లి పరామర్శించడం వారి మధ్య ఉన్న బంధాన్ని తెలియజేస్తుంది.

# ఈ విధమైన అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదు... దీనిని ఆ దేశాలు గుర్తించాలి

అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదని, ఈ విషయాన్ని శక్తిమంతమైన దేశాలు గుర్తించాలని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. శక్తిమంతమైన దేశమైనా సరే తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని పుణేలో సింబయోసిస్ ఇంటర్నేషనల్‌లో జరిగిన స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచీకరణ మన ఆలోచన విధానంలో, పని విధానంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని మంత్రి పేర్కొన్నారు. అధికారం అనే పదానికి ఎన్నో అర్థాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. వాణిజ్యం, మిలిటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా ఇవి మారుతుంటాయని అన్నారు. ఈ విధమైన అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రపంచాధిపత్యం కలిగిన దేశాలు గుర్తించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉంటుందని వ్యాఖ్యానించారు. భారత్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు తయారీ రంగంలో దూసుకెళ్లాల్సిన అవశ్యకతను ఆయన గుర్తు చేశారు.

# జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం.. మరింత జాప్యం!

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న నాంపల్లి సీబీఐ కోర్టు న్యాయమూర్తి బదిలీ కావడంతో, దశాబ్దాలుగా సాగుతున్న విచారణ మరింత ఆలస్యం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాంపల్లి సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా ఉన్న రఘురాం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త న్యాయమూర్తిగా పట్టాభిరామారావును నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుత న్యాయమూర్తి ఈ నెల 22వ తేదీ తర్వాత రిలీవ్ కానుండగా, 29వ తేదీలోపు కొత్త న్యాయమూర్తి బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో కొత్తగా బాధ్యతలు చేపట్టే న్యాయమూర్తి కేసును మళ్లీ మొదటి నుంచి అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఇది విచారణ ప్రక్రియపై ప్రభావం చూపిస్తుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. గతంలో కూడా పలుమార్లు న్యాయమూర్తులు మారడం వల్ల జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ముందుకు సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ కేసులో దాఖలైన డిశ్చార్జ్ పిటిషన్ల విచారణే ఇంకా పూర్తికాలేదు. ప్రధాన కేసు ట్రయల్ దశకు వెళ్లకుండా ఈ పిటిషన్లు అడ్డంకిగా ఉన్నాయని, వ్యూహాత్మకంగానే కేసులో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసును వేగంగా విచారించి తీర్పు వెల్లడించాలని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఆచరణలో అవి అమలు కావడం లేదు. తాజా పరిణామంతో విచారణ ఎప్పుడు పూర్తవుతుందనే అంశంపై మళ్లీ అనిశ్చితి నెలకొంది. కొత్తగా బాధ్యతలు చేపట్టబోయే న్యాయమూర్తి అయినా విచారణను వేగవంతం చేస్తారా? లేదా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బెంగాల్ ర్యాలీలో వర్చువల్‌గా మాట్లాడిన మోదీ.. మమతా బెనర్జీ ప్రభుత్వంపై విమర్శలు

పశ్చిమ బెంగాల్‌లోని నాడియా లో జరిగిన ర్యాలీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పొగమంచు కారణంగా ర్యాలీ ప్రాంతానికి చేరుకోలేక పోయిన ఆయన, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అధికార టీఎంసీ ప్రభుత్వం బెంగాల్‌లో చొరబాటుదారులను ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని అన్నారు. మమతా బెనర్జీ పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మోదీ దుయ్యబట్టారు. ఇటువంటి మహా జంగిల్ రాజ్‌కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తృణమూల్ నేతలు, ఆ పార్టీ బీజేపీని ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం తాము ఎప్పుడూ ఆపబోమని ఆయన స్పష్టం చేశారు.

# చిన్న ఆలోచనలే ఒక్కోసారి గొప్ప అభివృదికి బాటలు వేస్తాయి

- మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ పెరగడమే కాకుండా, నాయకత్వ లక్షణాలు కూడా అలవడతాయి" అని వివరించారు. రాష్ట్రంలోని 75 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ బాధ్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. "మీరంతా రాష్ట్రానికి గొప్ప ఆస్తి. అందుకే అమ్మకు వందనం ద్వారా ఆర్థిక సాయం, నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నాం. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే చిన్నతనం నుంచే కృషి చేయాలి. విద్యార్థులంతా నాలెడ్జ్ ఎకానమీలో భాగం కావాలి" అని ఆకాంక్షించారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 75 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో వినూత్న సంస్కరణలు తీసుకొస్తున్నారని, విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు మంత్రులందరూ కృషి చేస్తున్నారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంపై కేంద్రం బుల్డోజర్

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA)పై కేంద్ర ప్రభుత్వం పద్ధతి ప్రకారం బుల్డోజర్ నడుపుతోందని ఆమె శనివారం ఆరోపించారు. ఇది గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాయడమేనని, వారి జీవనోపాధిపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పంచుకున్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో వీబీ-జీ రామ్ జీ బిల్లు 2025ను ఆమోదించిన నేపథ్యంలో సోనియా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దాదాపు రెండు దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చిన విషయాన్ని సోనియా గుర్తుచేశారు. ఇది కోట్లాది గ్రామీణ కుటుంబాలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు జీవనోపాధి భద్రత కల్పించిన ఒక విప్లవాత్మక అడుగు అని ఆమె పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఈ పథకం పేదలకు జీవనాధారంగా నిలిచిందని తెలిపారు. అయితే, గత 11 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చేందుకు అనేక ప్రయత్నాలు చేసిందని సోనియా ఆరోపించారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా ఉపాధి హామీ పథకం స్వరూపాన్నే మార్చేశారని, చివరకు మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి, ఎక్కడ, ఎంత పని ఇవ్వాలనే నిర్ణయాలను క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఢిల్లీ నుంచి తీసుకుంటున్నారని విమర్శించారు. "20 ఏళ్ల క్రితం ఈ చట్టం కోసం నేను పోరాడాను. ఇప్పుడు ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కూడా నేను కట్టుబడి ఉన్నాను" అని సోనియా ఉద్ఘాటించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# అమరజీవి జలధార జలజీవన్ మిషన్ శంకుస్థాపన లో పాల్గొన్నా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 20.**అమరజీవి జలధార జలజీవన్ మిషన్ కు శంకుస్థాపన సందర్భంగా శనివారం తూర్పు గోదావరి జిల్లా, పెరవలి లోని చీఎ -216 ు వద్ద, =ఎ రైస్ మిల్ సమీపంలో ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు 68 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించే దిశగా అమరజీవి జలధార జలజీవన్ మిషన్ నిధులు 3050 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ తో తాడేపల్లిగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# నిబంధనల ప్రకారం పోలవరం ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు



**రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యవేక్షణ**

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 20:**
పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారి అర్హతలను బట్టి ఆర్ అండ్ ఆర్ (రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్) ప్యాకేజీ అమలు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ యస్. బొజ్జిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన, ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, ఎల్ ఎం సి స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, 11 మండలాలకు సంబంధించిన తహసిల్దార్లు, ఎస్ డి సి, పోలవరం ముంపు బాధితులు, వివిధ గిరిజన సముదాయాలు పాల్గొన్నారు. చైర్మన్ బొజ్జిరెడ్డి, దేవీపట్నం మండలంలో 44 గ్రామాల ముంపు బాధితులకు ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీల వివరాలు, గిరిజనులకు ల్యాండ్ టు ల్యాండ్ ఎకరాల కేటాయింపు, ఇంకా మిగిలిన కాలనీల ఏర్పాటు అవసరాలను సమీక్షించారు. అన్ని ఆర్ అండ్ ఆర్ కాలనీలలో పూర్తి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని మరియు ఏజెన్సీ ప్రాంతంలోని బినామీ అక్రమ క్వారీలను తొలగించాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే, వివిధ గిరిజన తెగలకు కుల ధ్రువీకరణ పత్రాలు వారి అర్హతను బట్టి మంజూరు చేయాలని, పిసా గ్రామ సభల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ , సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎల్. వెంకటేశ్వర్లు, జి. కనకరాజు, తహసిల్దార్లు సిహెచ్. శ్రీనివాసరావు, దొరకయ్య, కరక సత్యనారాయణ, వేణుగోపాల్, ఎ. సత్యనారాయణ, డిప్యూటీ తహసిల్దారులు శ్రీధర్, త్రిమూర్తులు, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు నైతిక విలువలు, నిజనిర్ధారణ అవసరం




- మంత్రి వాసంశెట్టి సుభాష్
- ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాదే కీలక పాత్ర

**రామచంద్రపురం, పెన్ పవర్,డిసెంబర్ 20:**ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాదే కీలక పాత్ర అని, ప్రభుత్వం తీసుకునే విధాన పర నిర్ణయాలను సరైన అవగాహనతో ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలోని వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో, సీఆర్ మీడియా అకాడమీ - సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన జిల్లా గ్రామీణ విలేఖరుల పునశ్చరణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కార్మికుల పని వేళలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు వారి సంక్షేమానికి దోహదపడతాయని తెలిపారు. పని వేళల నియంత్రణ వల్ల కార్మికులకు కుటుంబంతో గడిపే సమయం, మెరుగైన వేతనం అందుబాటులోకి వస్తాయన్నారు. జర్నలిస్టులు కూడా కార్మికులేనని, అయితే అన్ని పరిస్థితుల్లో పనిచేసే ప్రత్యేకమైన వర్గమని ఆయన వ్యాఖ్యానించారు. అవినీతిని వెలుగులోకి తీసుకొచ్చే క్రమంలో పాత్రికేయులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తనపై వ్యక్తిగతంగా వచ్చే వార్తలను కూడా తన అభిప్రాయాలు, పరిస్థితులను చక్కదిద్దుకునే అవకాశంగా భావిస్తామని మంత్రి తెలిపారు. ఆర్డీఓ డి. అఖిల మాట్లాడుతూ, పత్రికా కథనాల ద్వారా వివిధ అంశాలపై తమకు అవగాహన పెరుగుతుందని, జర్నలిస్టులకు పునశ్చరణ తరగతులు నిర్వహించడం అభినందనీయమైన కార్యక్రమమని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ మాట్లాడుతూ, పాత్రికేయులకు కూడా సాధారణ పౌరుల మాదిరిగానే భావప్రకటన స్వేచ్ఛ ఉందని గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రజల హక్కులను కాపాడే రీతిలో ఈ స్వేచ్ఛను వినియోగించాలని అన్నారు. జర్నలిస్టులు జీవితాంతం కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండాలని, రాసే అంశంపై పూర్తి అవగాహనతో పాటు క్లుప్తంగా రాయడం అలవర్చుకోవాలని సూచించారు. "చందమామ" మాసపత్రికను కథల క్లుప్తీకరణకు మంచి ఉదాహరణగా పేర్కొన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నిరంతర విద్యార్థిలా అధ్యయనం చేయాలని, జర్నలిస్టులు చేసే విమర్శలను సానుకూలంగా స్వీకరించాలని సూచించారు. జర్నలిస్టుల యూనియన్ నాయకులు స్వాతి ప్రసాద్ మాట్లాడుతూ, విలేఖరులకు పునశ్చరణ తరగతులు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

తొలిరోజు పునశ్చరణ తరగతుల్లో సీనియర్ జర్నలిస్టులు పెద్దాడ నవీన్ "సంక్షోభం నుంచి స్వావలంబన వైపు", డి. సోమసుందర్ "గ్రామీణ వార్తలు %-% కథనాలు", విజయకుమార్ కుర్రా "కృత్రిమ మేధ" అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను పాత్రికేయులు ఘనంగా సన్మానించారు.



# ప్రతీ చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించాలి

**ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

**ఏలూరు, డిసెంబర్, 20 పెన్ పవర్ :** ఏలూరు జిల్లాలో ఈనెల 21 నుండి 23 వరకు జరగనున్న పల్స్ పోలియో లో జిల్లాలోని 5 సంవత్సరంలోపు ప్రతీ చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 5 సంవత్సరాలలోపు 2 లక్షల 4 మంది చిన్నారులు ఉన్నారని, వీరిలో గ్రామీణ ప్రాంతంలో లక్షా 49 వేల 470 మంది, పట్టణ ప్రాంతాలలో 29 వేల 827 మంది, గిరిజన ప్రాంతాలలో 20 వేల 707 మంది చిన్నారులు ఉన్నారన్నారు. వారికి అవసరమైన వాక్సిన్ డోసులు సిద్ధం చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 1707 వ్యాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతీ గ్రామంలోనూ పోలియో వాక్సిన్ వేసేందుకు కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈనెల 21వతేదీన ప్రతీ చిన్నారికీ 1707 వ్యాక్సినేషన్ కేంద్రాలు , 72 మొబైల్ కేంద్రాలు ద్వారా పల్స్ పోలియో వాక్సిన్ అందించడం జరుగుతుందని, ఆర్టీసీ బస్సు స్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద కూడా పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటుచేసి పోలియో వాక్సిన్ వేయడం
జరుగుతుందన్నారు. అనంతరం 22, 23 వ తేదీలలో ఇంటింటికీ వెళ్ళి పోలియో వాక్సిన్ తీసుకోని చిన్నారులను గుర్తించి, వారికి వారి ఇంటివద్దే వాక్సిన్ అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

# పర్యావరణ పరిరక్షణను ఆర్థికాభివృద్ధికి అనుసంధానించాలి

**స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపు**



**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్,డిసెంబర్ 20:** పర్యావరణాన్ని కాపాడడమే కాకుండా, అందులో దాగి ఉన్న అవకాశాలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధికిఅనుసంధానించాల్సిన అవసరం ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా, డిసెంబర్ నెల థీమ్ "పర్యావరణ పరిరక్షణలో అవకాశాలు" అంశంపై శనివారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయం లో అవగాహన సదస్సు నిర్వహించారు. నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎస్.వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొనగా, విశిష్ట అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువుల స్టాళ్లు, ఈకో టీ స్టాల్ను అతిథులు పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పర్యావరణంలో దాగి ఉన్న అవకాశాలపై దృష్టి సారించాలని అన్నారు. ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే చెత్తను వనరులుగా మార్చి సంపద సృష్టించే మార్గాలను అన్వేషించాలని యువతకు పిలుపునిచ్చారు. సోమవారం నుంచి కాకినాడ నగరంలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను తాను పరిశీలించడంతో పాటు, తడి చెత్త%-%పొడి చెత్తపై ప్రజలకు అవగాహన ఉందో లేదో స్వయంగా తెలుసుకుంటానని తెలిపారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనిషా మాట్లాడుతూ, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, ఇంటి వద్దే తడి చెత్త%-%పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, దాదాపు 25 సంవత్సరాల క్రితమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర భావనకు పునాది వేశారని గుర్తు చేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల ద్వారా దేశానికి స్వచ్ఛత దిశగా మార్గనిర్దేశం చేసిన విజనరీ నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడని కొనియాడారు. "పర్యావరణంలో అవకాశాలు" అనే అంశం ద్వారా వ్యర్థాలను వనరులుగా మార్చుతూ స్వయం ఉపాధి, వాణిజ్య అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రీసైక్లింగ్, కంపోస్ట్ తయారీ, సేంద్రియ వ్యవసాయం, సౌరశక్తి వంటి పునరుత్పాదక శక్తి రంగాల్లో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇంచార్జ్ కమిషనర్ ఎస్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, స్వచ్ఛ ఆంధ్ర %-% స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణతో పాటు అందులోని ఉపాధి అభివృద్ధి అవకాశాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని వివరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ సేంద్రియ ఎరువుల విక్రయాన్ని ప్రారంభించి, స్వయంగా రూ.200 చెల్లించి సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వద్ద నుంచి 10 సేంద్రియ ఎరువుల ప్యాకెట్లు కొనుగోలు చేశారు. సమావేశానికి హాజరైన మహిళలు కూడా ఉత్సాహంగా సేంద్రియ ఎరువులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎస్.ఈ.పి వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డా. పృథ్వి చరణ్, టిపిఆర్ఓ శైలజ, మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీ జి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, పై అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు




**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 20:**కాకినాడ పట్టణంలోని టౌన్ హాల్ సెంటర్ వద్ద శనివారం వాహనదారులు, పాదాచారులకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకంపై కాకినాడ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ, మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయ రాదని హెచ్చరించారు. అలాగే రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా వాహనాలు నడపరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని తెలిపారు. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్‌లో మాట్లాడటం నిషిద్ధమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మోటార్ వాహనాలు కలిగిన వారు ప్రభుత్వము జారీ చేసిన అధికారిక నంబర్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని అవగాహన కల్పించారు. అదే విధంగా సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పిస్తూ, ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, అత్యవసర సేవల నంబర్లు 112/100, 1930, 1972 వినియోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్ తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభానికి కాకినాడకు వచ్చిన రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం



**కాకినాడ పెన్ పవర్, డిసెంబర్ 20:**
కాకినాడలో రేపు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీ సత్య కుమార్ యాదవ్ గారికి శనివారం రాత్రి ఘన స్వాగతం లభించింది. నగరంలోని జి ఆర్ టి గ్రాండ్ హోటల్ వద్ద మంత్రి సత్య కుమార్ యాదవ్ గారిని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై మంత్రి తో కలెక్టర్ సంక్షిప్తంగా చర్చించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ స్వాగత కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గోదావరి మధ్య ఇసుక తిన్నెలలో 40 వేల చదరపు అడుగుల భారీ ఫ్లెక్సీ ..

- కంటే వినయ్ తేజా ఆధ్వర్యంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు..
- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా..

**రాజమహేంద్రవరం,కోరుకొండ, పెన్ పవర్, డిసెంబర్ 20 :**మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజానగరం నియోజవర్గం కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన కంటే వినయ్ తేజ ఆధ్వర్యంలో మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సంక్షేమానికి, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచారని అన్నారు. ఆయన పాలన ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది అనేకమంది ఆంధ్రప్రదేశ్ వైపు చూపులు చూసే పరిస్థితి తీసుకువచ్చారని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్మెంట్, రైతు భరోసా తదితర పథకాలు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. తండ్రి ఆశయాలు ముందుకు తీసుకు వెళ్ళేందుకే రాజకీయాల్లోకి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వచ్చారని అన్నారు. సంక్షేమ అభివృద్ధి జోడు గుర్రాల మాదిరిగా పాలన సాగించారని అన్నారు. అనేక సంస్కరణ తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు 5 సంవత్సరాలు కాలంలో అనేక పథకాలు ప్రవేశపెట్టి మేలు చేకూర్చారని వివరించారు. ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించారని తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా గొప్ప కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఆ అభిమానంతోనే కంటే వినయ్ తేజ ఆయన పుట్టినరోజు ఘనంగా నిర్వహించాలని ఉద్దేశంతో గోదావరి నది లో అనేక వ్యయప్రయాసలకోర్చి గోదావరి నది మధ్యలో జన్మదిన వేడుకలు నిర్వహించారని తెలిపారు. జగన్ కు ఆయురారోగ్యాలతో శక్తి సామర్థ్యాలతో ప్రజలకు మరింత మేలు చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు కంటే వినయ్ తేజ మాట్లాడుతూ గోదావరి ప్రజలకు మమకారం, ఎటకారం ఎక్కువ అని అన్నారు. అదే రకంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ పై ప్రేమ చూపించాలని ఉద్దేశంతో గోదావరి నది జలాల మధ్యలో జన్మదిన వేడుకలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి సంక్షేమం అంటే గుర్తుకు వచ్చేది దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబమని అన్నారు. మెట్ట ప్రాంత రైతులకు మేలు చేసింది వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. మెట్ట ప్రాంత రైతులు చిరిగిపోయిన చొక్కాల తో తమ తాతలు, తండ్రులు ఉండేవారని, ఇప్పుడు మంచి పరిస్థితిలో ఉన్నామంటే 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జల యజ్ఞం పేరుతో మెట్ట ప్రాంత రైతులకు త్రాగు, సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకున్నారని అన్నారు. జక్కంపూడి రాజా తమ ఆరాధ్య దైవం అని ఆయనకు ఆరోగ్య దైవం అయిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు . ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఉండాలని పేర్కొన్నారు. జగన్ జన్మదిన వేడుకలలో సుమారు 200 మంది పాల్గొన్నారు.



# పాఠశాలల్లో ముస్తాబు అలవాటు ఆరోగ్యానికి మేలు




◆ ఐటీడీఏ పీఓ స్మరణ్ రాజ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 20 :** ప్రతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిరోజూ ముస్తాబుగా ఉంటే మంచి ఆరోగ్యం, పరిశుభ్రత అలవడుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. శనివారం రంపచోడవరం మండలం ఇర్లపల్లి గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ముస్తాబు' కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్మరణ్ రాజ్ మాట్లాడుతూ, ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఏకలవ్య పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం లేవగానే శుభ్రత పాటించి, ముస్తాబై తరగతి గదుల్లోకి వెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ప్రతిరోజూ పునశ్చరణ చేస్తూ ఉన్నత తరగతులకు చేరుకోవాలని తెలిపారు.
గోర్లు పెరిగిన వెంటనే కట్ చేసుకోవడం, పాఠశాల ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న కాస్మెటిక్ సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మంచి విద్యతో ఉన్నతమైన ఉద్యోగాలు సాధించే దిశగా ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, సహాయక గిరిజన సంక్షేమ అధికారి జె. శంభుడు, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్ లోడ్ తో రోడ్డెక్కిన లారీలకు భారీ జరిమానా



**సీతానగరం, పెన్ పవర్, డిసెంబర్ 20:** మండలంలోని గత కొన్ని రోజులుగా మొదలైన కొత్త ఇసుక ర్యాంపుల నుండి అధిక బరువుతో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న లారీలకు అధికారులు భారీ జరిమానా విధించారు. శుక్రవారంనాడు మైన్స్ ట్రాన్స్పోర్ట్ ఎస్ఐ కే. ఆంజనేయులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఓవర్ లోడ్ తో వెళుతున్న మూడు ఇసుక లారీలను బొబ్బిలంక వద్ద అడ్డుకున్నారు. లారీలు ఎటువంటి బిల్లులు లేకుండా పరిమితికి మించిన ఇసుక ఓవర్ లోడ్ తో వెళు న్నట్లు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను రవాణా శాఖ అధికారులు ఒక్కో లారీకి 80 వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. మూడు ఇసుక లారీలు కలిపి మొత్తం 2.40 లక్షల రూపాయల పెనాల్టీ వసూలు చేశారు. లారీ యాజమాన్యులు జరిమానా మొత్తాన్ని చెల్లించడంతో అధికారులు వాహనాలను విడిచిపెట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బాల్యవివాహాలు, టీనేజీ గర్భధారణ నిర్మూలన అందరి బాధ్యత

◆ ఐటీడీఏ పీఓ స్మరణ్ రాజ్




**రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 20 :** ఏజెన్సీ ప్రాంతంలో బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలను పూర్తిగా నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ అన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో బాల్యవివాహాలు, టీనేజీ గర్భధారణలను నివారించేందుకు నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి గ్రామంలో బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే అన్ని పాఠశాలల్లోనూ ఈ అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు పూర్తైన తరువాత మాత్రమే వివాహాలు జరగాలనే విషయాన్ని పంచాయతీ స్థాయిలో ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే సీడీపీఓలు, పోలీస్ స్టేషన్లు, అంగన్వాడీ టీచర్లకు తెలియజేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాల్యవివాహాలు చేయడం, వాటిలో పాల్గొనడం చట్టరీత్యా నేరమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు కె. ఉమా, ఎల్. శాంతికుమారి, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి

◆ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ యస్. బొజ్జిరెడ్డి



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 20 :** పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ యస్. బొజ్జిరెడ్డి తెలిపారు. శనివారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలులో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన బాధితులు, వివిధ గ్రామాలకు సంబంధించిన సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముంపు బాధితుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను వారి అర్హతలను బట్టి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుకు సంబంధించి సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే గ్రామస్థాయి సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏపీవో జనరల్ డివిన్వి రమణ, సిడిపిఓలు కె. ఉమా, ఎల్. శాంతికుమారి, గురుకులం సెల్ నాగేంద్ర, మడకం వరప్రసాద్ దొర, డి. రామారావు, బాబి తదితరులు పాల్గొన్నారు.

# చిట్టి చేతుల సుజనాత్మకంగా 2026 క్యాలెండర్

◆ నో బ్యాగ్ డే సందర్భంగా ర్యాలి పాఠశాల చిన్నారుల వినూత్న ఆలోచన




**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 20:** చిన్నారుల చిట్టి చేతుల్లోని సృజనాత్మకత ఎంత గొప్పదో మరోసారి రుజువైంది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం ర్యాలి ప్రధాన ప్రాథమిక ఫౌండేషన్ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థులు తమ చేతులతోనే ఆకర్షణీయమైన 2026 క్యాలెండర్‌ను రూపొందించి అందరి ప్రశంసలు అందుకున్నారు.
ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ మార్గదర్శకత్వంలో, నో బ్యాగ్ డే సందర్భంగా "కాలనిర్ణయం" అనే పేరుతో ఈ క్యాలెండర్‌ను విద్యార్థులు సృజనాత్మకంగా తయారు చేశారు. రంగుల కాగితాలు, చిత్రాలు, అక్షరాల అలంకరణలతో నెలల వివరాలను చక్కగా మలిచారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో సృజనాత్మకత, సమయ నిర్వహణపై అవగాహన పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ క్యాలెండర్లను రాష్ట్రపతి, గవర్నర్, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు నూతన సంవత్సరం కానుకలుగా పంపించనున్నట్లు పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. చిన్నారులు తయారు చేసిన ఈ క్యాలెండర్లు విద్యా రంగంలో వినూత్న ప్రయోగాలకు నిదర్శనంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.
నో బ్యాగ్ డేలో పుస్తకాలకే పరిమితం కాకుండా, ఆచరణాత్మక విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచనలు మరింత వికసిస్తున్నాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ర్యాలి పాఠశాల చిన్నారుల ఈ ప్రయత్నం ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు ప్రశంసించారు.

# పోలియో చుక్కలు వేయించడం తప్పనిసరి



◆ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ డిసెంబర్ 20:** ఏజెన్సీ ప్రాంతంలోని ఐదు సంవత్సరాల లోపు బాలబాలికలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్ బొజ్జిరెడ్డి తెలిపారు.
శనివారం స్థానిక ఐటిడిఏ కార్యాలయ ప్రాంగణంలో పోలియో చుక్కల ర్యాలీని ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ బొజ్జిరెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 21వ తారీకు ఆదివారం ఉదయం నుండి ప్రతి గ్రామంలో, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, బస్టాండ్‌ల వంటి జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేయడం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆయన తల్లిదండ్రులను కూడా పిల్లలను బూత్‌లకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలన్నారు.
రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ తెలిపారు, ఏజెన్సీ ఏడు మండలాల్లో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 18,164 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు 1,525 వైల్స్ మరియు 32,560 పోలియో చుక్కల డోసులు సిద్ధం చేసినట్లు. బాలబాలికలకు చుక్కలు వేయడానికి 591 బూతులు, 75 రూట్లు, 28 మొబైల్ టీమ్స్, 8 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పోలియో చుక్కల కార్యక్రమంలో ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డి.ఎన్.వి. రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, అడిషనల్ డి.ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సరిత, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో వై. రాజు, వైద్యాధికారులు శ్వేత, వినోద్, సిడిపిఓలు కె. ఉమా, ఎల్. శాంతికుమారి, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

◆ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని ప్రారంభించిన ఐటీడీఏ పీఓ స్మరణ్ రాజ్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 20 :** ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి గ్రామంలో మానవ జీవనానికి పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకమని, దాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీడీఏ పీఓ స్మరణ్ రాజ్‌తో పాటు ఏపీఓ జనరల్ డీఎన్వీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, ఏడీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పిల్లి సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా స్మరణ్ రాజ్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర%-%స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు తమకు నచ్చిన మొక్కలను నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని సూచించారు. ఏజెన్సీ పరిధిలోని ఏడు మండలాల్లో ఉన్న 120 గ్రామ సచివాలయాల పరిధిలో పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో మురుగునీటి కుంటలు లేకుండా చర్యలు చేపట్టి, దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు.
అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, నివాస ప్రాంతాల పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రత పాటించాలని, పంచాయతీలు ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లోనే చెత్తను వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర%-%స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే బాధ్యత మనందరిదేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమం ప్రారంభంలో ఏపీఓ జనరల్ డీఎన్వీ రమణ అందరితో స్వర్ణాంధ్ర%-%స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి జే. శంభుడు, డిప్యూటీ ఎంపీడీవో వై. రాజు, వైద్యాధికారులు శ్వేత, వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కామరాజు, గురుకులం సెల్ అధికారి నాగేంద్ర, గ్రామ సచివాలయ సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేట పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన పెద్దాపురం డీఎస్పీ




**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 20:** వార్షిక తనిఖీల్లో భాగంగా జగ్గంపేట పోలీస్ స్టేషన్ ను శనివారం పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి జగ్గంపేట పోలీసుస్టేషన్ ప్రాంగణం, లాకప్స్, రికార్డులు, ప్రాపర్టీ స్టోరేజ్ రూమ్, కేస్ డైరీ ఫైళ్లను సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణలో మరింత క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజా సేవా దృక్పథంతో పని చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో శుభ్రత, రికార్డుల నిర్వహణ, సాంకేతిక వనరుల వినియోగం, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఎలాంటి అల్లర్లు గొడవలు జరగకుండా గ్రామాలను సందర్శిస్తూ శాంతి భద్రతలపై, సైబర్ క్రైమ్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు మొదలగు వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేసుల పెండెన్సీ తగ్గించాలి. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పెంచాలి. ప్రాపర్టీ కేసుల్లో రికవరీ సాధించాలి. రోడ్డు ప్రమాదాల నియంత్రణ మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేయాలని సుచించారు.
కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వారి ఉత్తర్వులు పాటించి, జగ్గంపేట పిఎస్ పరిధిని, నేర రహిత ప్రాంతంగా చేయాలని డిఎస్పి కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కె శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండాలి

ముస్తాబు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ శిరీషదేవి



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్20:** విద్యార్థుల యొక్క ఆరోగ్యం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు.
రంపచోడవరం మండలంలోని ఇర్లపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయురాలు సేవా రాజేశ్వరి అధ్యక్షతన ముస్తాబు అనే కార్యక్రమం నిర్వహించారు.
కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ప్రాముఖ్యంగా వ్యక్తిగతంగా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అప్పుడు మానసికంగా, ఆధ్యాత్మికంగా, సాంఘీకంగాదృడంగా ఉండటానికి వీలుంటుందన్నారు. దానికి గాను ప్రతీరోజు వ్యాయామం చేయాలని సూచించారు. ఎక్కువగా అనారోగ్యలకు కారణం శుభ్రత లేకపోవటమన్నారు. దానిని బట్టి ముందుగా ప్రతీ విద్యార్థి మంచి వాతావరణంలో ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రత ఎంత ముఖ్యమో, వ్యక్తిగత, మానసిక శుభ్రత కూడా అంతే ముఖ్యమన్నారు. దానికి గాను చేతులు శుభ్రం చేసుకోవటం ఎలాగో ఆమె స్వయంగా చూపించి విద్యార్థులకు నేర్పించారు. మనము ఎలా ఉన్నాము అనేది లిఅద్దం లో మన ముఖాన్ని చూసుకున్నట్లే మన మనసు కూడా మంచిగా ఉండేలా నిత్యం సరిచేసు కోవాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు. అలాగే పాఠశాల లోని వంటసాలను, పరిసరాలను పరిశీలించారు. ఎప్పుడు చాలా పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ ముస్తాబు అనే కార్యక్రమం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ప్రతీ పాఠశాలలో, వసతి గృహాల్లో పటిష్టంగా అమలు చేయాలని కోరారు. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేకశ్రద్ధ పెట్టి ఉత్తీర్ణత శాతం పెంచాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. చదువులో వెనుక బడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.
కార్యక్రమంలో ఆమె వెంట మండలపార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంతమోహన్, నియోజకవర్గ ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా చెల్లన్నదొర, సీనియర్ నాయకులు చవలం బాపిరాజు, సీతపల్లి దేవస్థానం బాపనమ్మ తల్లి గుడి చైర్మన్ బాపన్నదొర, సభ్యులు సిద్ధా వెంకన్నదొర, కారం సింహాచలం, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కోసు నాగన్న దొర, గణపతి, గ్రామ కమిటి అధ్యక్షులు మేరా సాహెబ్, జి సి డి ఓ దూడ శాంతిమతి, పిఎంఆర్సి ఏటీవో. చిన్నిబాబు, పి ఎం ఆర్ సి సి ఎం ఓ బి మంగిరెడ్డి, ఎ టి డబ్ల్యూ ఓ జల్లి సంభుడు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 20 :**యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై ఆసక్తి చూపాలని జనసేన పార్టీ సీనియర్ నాయకులు పదం వెంకటకృష్ణ సూచించారు. శుక్రవారం రాత్రి యువతకు షటిల్ బాటిల్ కిడ్స్ ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి చూపి క్రీడలలో రాణించాలని అన్నారు. క్రీడలతో ఆరోగ్యం మెరుగుపరుచుకోవడానికి అవకాశం ఉంటుందని షటిల్ కిడ్స్ ని అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. యువకులకు క్రీడ లు తో పాటు వారి మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. యువతకు ఏ క్రీడలో నైనా సదుపాయాలు కల్పించి వారి పురోగతికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పదం వెంకటకృష్ణ తెలిపారు.

## యువతిపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- గుడ్ ట్రయల్ మానిటరింగ్‌తో సత్ఫలితాలు - జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

**భీమవరం, పెన్ పవర్ నవంబర్ 20 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, పర్యవేక్షణలో అమలు చేస్తున్న "గుడ్ ట్రయల్ మానిటరింగ్" విధానాలు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని జిల్లా పోలీసులు వెల్లడించారు.

యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఏలూరులోని 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు తుది తీర్పును వెలువరించింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

పశ్చిమ గోదావరి జిల్లా అరట్లకట్ట గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతిపై, అదే గ్రామానికి చెందిన మామిడిశెట్టి రమేష్ బాబు (27) జూన్ 16, 2022న అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇంట్లోకి చొరబడి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి బామ్మ ప్రతిఘటించడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం జూన్ 18 2022 న బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ కేసును నమోదు చేయగా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస కుమార్ వేగవంతంగా దర్యాప్తు చేపట్టి రెండు రోజుల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు.

సుదీర్ఘ విచారణ అనంతరం నిందితుడిపై మోపబడిన అభియోగాలు రుజువు కావడంతో, గౌరవ 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి ఎం.వి.వి.ఎస్. మురళీ కృష్ణ ఈ విధంగా శిక్ష విధించారు.

ఐపిసి సెక్షన్ 376(2)(ఎఫ్ ) కింద 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా

ఐపిసి సెక్షన్ 450 కింద 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా

ఈ శిక్షలు ఏకకాలంలో అమలవుతాయని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఈ కేసును సమర్థవంతంగా ప్రాసిక్యూట్ చేసిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతమనేని రమేష్ ని, దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన నర్సాపురం డీఎస్పీ శ్రీమతి జి. వేద , పాలకొల్లు రూరల్ సీఐ జి. శ్రీనివాస్ , ఎస్సై బి. సురేంద్ర కుమార్ , కోర్టు విధుల్లో సహకరించిన ఏఎస్ఐ ఎస్. ప్రదీప్ కుమార్, పీసీ ఆర్.వి.ఎ. రాజులను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ప్రత్యేకంగా అభినందించారు.

నేరాల నియంత్రణతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా పక్కా ఆధారాలతో కేసులు నిలబెట్టడమే జిల్లా పోలీసుల లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు.

## సమతుల్య ఆహారంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరం.



**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 20:** సమతుల్య ఆహారంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని సీనియర్ బిజెపి నాయకులు, సింగిలిదేవి సత్తిరాజు,ప్రముఖ ఆదర్శ రైతు కంపరపు నాగేశ్వరావు అన్నారు.కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరం ఎస్.ఎల్.వి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కొల్లా సత్య సరస్వతి ఆధ్వర్యంలో శనివారం ఉదయం సమతుల్య ఆహారం అనే కార్యక్రమంపై ప్రత్తిపాడులో ఎస్ ఎల్ వి, ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించి ప్రతిపాడు అల్లూరి సీతారామరాజు జంక్షన్ లో మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమానికి సింగిలిదేవి సత్తిరాజు,కంపరపు నాగేశ్వరావు,ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో మంచి ఆహారపు అలవాటులతోనే సుదీర్ఘకాలం ఆరోగ్యవంతులుగా ఉండగలుగుతామన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు సమ్మతుల్య ఆహారంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంచి ఆహారపు అలవాట్లు నేర్చుకోవాలని విద్యార్థులు నృత్య నాటకంతో చూపరులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎల్.వి. ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ ఉపేంద్ర, ఆఫీస్ ఇంచార్జ్ గొడే శేఖర్ ఎస్.ఎల్. వి.ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాలన్నీ స్వచ్ఛతతో అలరారినప్పుడే స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం పెన్ పవర్ డిసెంబర్ 20**:పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య భద్రత, భావితరాల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బండారు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే చెత్త సేకరణ కార్యక్రమంలో పాల్గొని తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి సేకరిస్తున్నారా అనే విషయాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. చెత్తను గ్రామపంచాయతీ అందించిన బుట్టలలోనే వేయాలని, కాలువలు-డ్రైనేజీల్లో వేయరాదని సూచించారు. ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలు అందించామని, పంచాయతీ సిబ్బంది క్రమం తప్పకుండా చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తారని వివరించారు.

డ్రైనేజీల్లో చెత్త వేయడం వల్ల మురుగు నీరు నిలిచి దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. "నా ఇల్లు శుభ్రంగా ఉంటే చాలు" అనే భావన సరిపోదని, నివసించే ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యక్తిగత పరిశుభ్రతకు సామాజిక పరిశుభ్రత తోడై దుష్ఫలితాలు దూరమవుతాయని అన్నారు.

అనంతరం గ్రామ పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొని తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ముస్తాబు కార్నర్లను పరిశీలించారు. చిన్నారులు అనారోగ్యానికి గురికాకుండా ఉండాలంటే పరిశుభ్రమైన వాతావరణం అవసరమని, చేతులు సబ్బుతో కడుక్కోవడం, భోజనం ముందు - తర్వాత, టాయిలెట్ వినియోగం అనంతరం పరిశుభ్రత పాటించడం తప్పనిసరి అని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు ప్రతి పాఠశాలలో ముస్తాబు కార్నర్ ఏర్పాటు చేస్తున్నామని, పరిశుభ్రత పాటించే విద్యార్థులకు బాలురు%-%బాలికల విభాగాల్లో హైజినిక్ లీడర్‌షిప్ అందిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పిల్లల్లో పరిశుభ్రతపై చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. పిల్లల ద్వారా కుటుంబాలకు కూడా పరిశుభ్రత సందేశం చేరుతుందని అన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి నెల మూడో శనివారం స్వయంగా ప్రజల్లోకి వెళ్లి స్వచ్ఛతపై చైతన్యం కల్పిస్తున్నారని పేర్కొంటూ, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు అందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమం చివర్లో విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.

## అడ్డతీగల మండలం గొంటువానిపాలెం లో స్వరా ంధ్ర స్వఛ్ఛాంధ్ర కార్యక్రమం..



**అడ్డతీగల, పెన్ పవర్, డిసెంబర్ 20 :** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వరా ంధ్ర స్వఛ్ఛాంధ్ర కార్యక్రమం ప్రతి నెల మూడో శనివారం నిర్వహించవలసి ఉన్నది, అందులో భాగంగా శనివారం అడ్డతీగల ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో పర్యావరణం పై ద ృష్టి సారించారు. దీనిలో భాగంగా శనివారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల గొంటువానిపాలెం లో పర్యావరణ సవాళ్ల, సమస్యపై పరిష్కారం కోసం పాఠశాలలతో సహకారం మరియు ప్రభుత్వ సంస్థలలో పరిశుభ్రత, ప్రజా పరిశు భ్రత మరియు పౌరుల భాగస్వామ్యం యొక్క విలువలను ప్రోత్సహించడానికి స్వఛ్ఛాంధ్ర దినోత్సవం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు . పారిశుధ్య కార్మికులు మరియు అనధికార వ్యర్థాల కార్మికులను గుర్తించి వ్యవస్థాపక పాత్రలుగా మార్చడానికి ప్రోత్సహించరూ. పాఠశాల స్థాయి పర్యావరణ వ్యవస్థాపక సవాళ్లతో సహా, నైపుణ్య పోటీలు మరియు ప్లాస్టిక్ వాడకం తగ్గించడం పై గ్రామంలో ఉన్న దుకాణాలకు వెళ్ళి, ఏ సామాన్లు కొనాలన్నా గుడ్డ లేదా నారా సంచులు మాత్రమే ఉపయోగించాలని, ప్లాస్టిక్ మన పరిసరాలలో కనపడకుండా ఎవరికి వారే వ్యక్తిగత జాగ్రత్త వహించాలని, ఈ విధానం పాటిస్తేఖచ్చితంగా ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుందని, అలాగే విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని, రోజుకు మూడు పూటలా చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కుమార్ విద్యార్థులకు తెలియజేశారు .

## విద్యుత్ ఆదా చేయండి -బుర్రకథ



**గండేపల్లి, పెన్ పవర్, డిసెంబర్, 20:**విద్యుత్తును ఆదా చేయాలంటూ బుర్రకథ రూపంలో మండల కేంద్రమైన గండేపల్లి లో పలుచోట్ల ప్రదర్శనలుస్తున్న బుర్రకథ దళం. ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా శనివారం మండల కేంద్రమైన గండేపల్లి గ్రామపంచాయతీ, మరియు జాతీయ రహదారి వెంబడి ఇంధన పొదుపు పై బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రకథ ద్వారా ఇంధన పొదుపు ఎలా చేయాలి? కరెంటు వృధా చేయకుండా ఎలా ఉండాలి అన్నదానిపై పద్య రూపంలో అవగాహన కల్పిస్తూ తెలియజేశారు. ఈ రకమైన పద్యాలు పలువురు నాకట్టుకున్నాయి.

## చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిగా మంత్రి లోకేష్ పర్యటన విజయవంతం




- క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన తెలుగుదేశం పార్టీ కేడర్
- విద్యాలయాల్లో రాజకీయ అలజడులు తగవు
- మీడియా సమావేశంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం పెన్ పవర్ డిసెంబర్ 20:**రాష్ట్ర చరిత్రలో కనివిని ఎరగని విధంగా రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ రాజమహేంద్రవరం పర్యటన విజయవంతమైందని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు( వాసు )అన్నారు.

గత రెండు రోజులుగా లోకేష్ పర్యటన నిమిత్తం తెలుగుదేశం పార్టీ కేడర్ అహర్నిశలు కష్టపడి పని చేశారని లోకేష్ కార్యక్రమాల్లో క్రమశిక్షణ పాటించి తెలుగుదేశం పార్టీకి ఉన్న పేరును నిలబెట్టారన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ ఎంతో సహనంతో , ఓపికతో విద్యార్థులతోనూ, అధ్యాపకులతోనూ, పార్టీ క్యాడర్ తోను, రాష్ట్ర నాయకులతోను, కార్యకర్తలతోనూ, అందరితోనూ వారి పరిస్థితులను తెలుసుకుంటూ సెలూటే దిగడం ఆయన విశాల ద ృక్పథానికి మచ్చుతునకని అన్నారు. ఆర్ట్స్ కళాశాలలో దక్షిణాఫ్రికా దేశాలకు చెందిన 8 మందితో విద్యార్థులతో సమాలోచ నలు జరపగా తమకు లాప్టాప్ లు లేవని ఈ సమస్యను మంత్రి లోకేష్ వద్ద ప్రస్తావించారన్నారు. లోకేష్ వెంట ఉన్న తాను ఆ విద్యార్థులకు లాప్టాప్లు అందజేయడానికి సంసిద్ధమయ్యానని శనివారం వారికి అందజేస్తున్నట్లు తెలిపారు. లోకేష్ పర్యటన విజయవంతం చేయడంలో ముఖ్యపాత్ర పోషించిన పోలీసులకు ,మీడియాకు, తెలుగుదేశం పార్టీ కేడర్ కు ఆయన క ృతజ్ఞతలు తెలిపారు. లోకేష్ పర్యటనకు సుమారు 30 వేలమంది జనం వచ్చారని, ముఖ్యంగా మహిళలు స్వఛ్ఛందంగా వచ్చారన్నారు. ప్రత్యర్థి పార్టీ తాయిలాలతో తరలించిన మహిళలు కాదన్నారు. లోకేష్ పర్యటనలో పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకుల, కార్యకర్తల సహకారం మర్చిపోలేమన్నారు. రాష్ట్రంలో మొట్టమొదట సారిగా దేవాదాయ కమిటీలన్నీ కూటమి పార్టీల నాయకుల సహాయ సహకారాలతో వివాదాలకతీతంగా కమిటీలు వేసుకోవడం రాష్ట్ర చరిత్రలో రికార్డ్ అని లోకేష్ అభినందించారన్నారు. ప్రజల సంక్షేమం ,అభివ ృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజీ పడేది లేదన్నారు. రాష్ట్రంలో కప్ రాష్ట్రంలో కుప్పం, హిందూపురం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా అయినట్లుగానే, మంగళగిరి ,రాజమహేంద్రవరం సీట్లు కూడా భవిష్యత్తులో కంచుకోటగా అయ్యే విధంగా రాబోయే రోజుల్లో తమ గట్టి గా క ృషి చేస్తామని భరోసా ఇస్తున్నానన్నారు.

విద్యాలయాలో రాజకీయాలు తగవు...

లోకేష్ పర్యటనలో అక్కడక్కడ చిన్న,చిన్న లోపాలు జరిగాయని, వాటిని భవిష్యత్తులో పునరావ ృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వాసు అన్నారు. విద్యాలయాల్లో రాజకీయాలు తగవని, విశ్వవిద్యాలయల చట్టప్రకారం విద్యాలయ ప్రాంగణాల్లో రాజకీయరంగులు , ఫ్లెక్సీలు ,రాజకీయ నినాదాలు నిషేధం ఉందని, మంత్రి లోకేష్ పర్యటనలో భాగంగా నన్నయ విశ్వవిద్యాలయంలో జనసేన పార్టీ అనుచరులు వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమన్నారు. అరాచకాలు, హత్య రాజకీయాలు,అక్రమాలతో రెడ్ బుక్కు లో ఎక్కిన ప్రతివారిని కూటమి ప్రభుత్వం తగిన సమయంలో చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జనసేన పార్టీ అనుచరులు చేసిన వ్యవహారంపై పవన్ కళ్యాణ్, లోకేష్ లు క్షమాపణలు చెప్పాలని వై సిపి నాయకులు డిమాండ్ ఏం చేయడం పై వ్యాఖ్యానిస్తూ స్పందిస్తూ రాజీనామా కోరాల్సిందని, వెంటనే ఎన్నికలు జరిపించేసి, వెంటనే జగన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసేస్తే సరిపోతుంది కదా అని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు మజ్జి రాంబాబు, వర్రీ శ్రీనివాసరావు, రెడ్డి మణి , బుడ్డిగ రవి , కదలి రామక ృష?, ఉప్పులూరి జానకిరామయ్య, ద్వారా పార్వతి సుందరి ,కొయ్యల రమణ, ఒక మొఖమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 104 ఉద్యోగుల సమస్యలపై ఉన్నతాధికారుల కు వినతి..



**అడ్డతీగల, పెన్ పవర్, డిసెంబర్ 20:**రాష్ట్ర కార్యాచరణలో భాగంగా 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను, తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శనివారం దుప్పులపాలెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్పందన కు104 ఉద్యోగులు అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో పైలట్ బి.వి.రమణ, డీఈవోస్ రామక ృష? పాల్గొన్నారు.అర్జీ ద్వారా 104 ఉద్యోగులు చాలాకాలంగా ఎదుర్కొంటున్న సేవా సంబంధిత ఇబ్బందులు, విధి భద్రత, జీతభత్యాల అంశాలు, ఉద్యోగ హక్కుల పరిరక్షణ వంటి అంశాలను వివరించారు. ఈ సమస్యలు ఉద్యోగుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వారు అధికారుల ద ృష్టికి తీసుకెళ్లారు.ఈ సందరరేగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ, అర్జీలో ప్రస్తావించిన అంశాలను సమగ్రంగా పరిశీలించి, ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేసి పరిష్కారానికి క ృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, పై అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు

**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 20:**కాకినాడ పట్టణంలోని టౌన్ హాల్ సెంటర్ వద్ద శనివారం వాహనదారులు, పాదాచారులకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకంపై కాకినాడ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందరరేగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ, మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయ రాదని హెచ్చరించారు. అలాగే రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా వాహనాలు నడపరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని తెలిపారు.వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్‌లో మాట్లాడటం నిషిద్ధమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మోటార్ వాహనాలు కలిగిన వారు ప్రభుత్వము జారీ చేసిన అధికారిక నంబర్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని అవగాహన కల్పించారు.అదే విధంగా సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పిస్తూ,ఆన్లైన్ మోసాలు,ఫేక్ లోన్స్ మోసాలు,ఆన్లైన్ జాబ్స్/వర్క్ మోసాలు,డిజిటల్ అరెస్టులు,అత్యవసర సేవల నంబర్లు 112/100, 1930, 1972 వినియోగం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్ట్రక్టర్ ఎన్. రమేష్ తో పాటు ట్రాఫిక్




సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, పై అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు

**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 20:**కాకినాడ పట్టణంలోని టౌన్ హాల్ సెంటర్ వద్ద శనివారం వాహనదారులు, పాదాచారులకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకంపై కాకినాడ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ, మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయ రాదని హెచ్చరించారు. అలాగే రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా వాహనాలు నడపరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని తెలిపారు.వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్‌లో మాట్లాడటం నిషిద్ధమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మోటార్ వాహనాలు కలిగిన వారు ప్రభుత్వము జారీ చేసిన అధికారిక నంబర్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని అవగాహన కల్పించారు.అదే విధంగా సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పిస్తూ,ఆన్లైన్ మోసాలు,ఫేక్ లోన్స్ మోసాలు,ఆన్లైన్ జాబ్స్/వర్క్స్ మోసాలు,డిజిటల్ అరెస్టులు,అత్యవసర సేవల నంబర్లు 112/100, 1930, 1972 వినియోగం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్ తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.




## సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, పై అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు



**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 20:**కాకినాడ పట్టణంలోని టౌన్ హాల్ సెంటర్ వద్ద శనివారం వాహనదారులు, పాదాచారులకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకంపై కాకినాడ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ, మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయ రాదని హెచ్చరించారు. అలాగే రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా వాహనాలు నడపరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని తెలిపారు.వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్‌లో మాట్లాడటం నిషిద్ధమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మోటార్ వాహనాలు కలిగిన వారు ప్రభుత్వము జారీ చేసిన అధికారిక నంబర్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని అవగాహన కల్పించారు.అదే విధంగా సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పిస్తూ,ఆన్లైన్ మోసాలు,ఫేక్ లోన్స్ మోసాలు,ఆన్లైన్ జాబ్స్/వర్క్స్ మోసాలు,డిజిటల్ అరెస్టులు,అత్యవసర సేవల నంబర్లు 112/100, 1930, 1972 వినియోగం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్ తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం.

- ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత పోరాడాలి
- ఎంపిడివో ఏ రాజు.




**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 20:**పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను సాధించాలనే సంకల్పానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఏ. రాజు పిలుపునిచ్చారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే "స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలమూరులో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, పరిసరాల పరిశు భ్రత అత్యంత కీలకమని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని హెచ్చరించారు. గ్రామాల్లోని ప్రజలు ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులను వాడేలా చైతన్యం కలిగిస్తున్నామని తెలిపారు.నివాసాల నుండి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను కేవలం చెత్తగా చూడకుండా, వాటిని ఉపయోగకరమైన వనరులుగా మార్చుకోవాలని ఆయన సూచించారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపి ఆదాయం పొందే దిశగా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రాష్ట్రం మొత్తం స్వచ్ఛాంధ్రగా మారుతుందని ఎంపీడీఓ రాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలమూరు సర్పంచ్ నేలపూడి లావణ్య కుమార్ రాజా, ఉపసర్పంచ్ చల్ల లక్ష్మీభూషణం, పంచాయతీ ఈవో కె. మోక్షంజలి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పారిశు ధ్యం పాత్రను వివరించారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చడానికి ప్రతిజ్ఞ చేశారు.

## ఘనంగా 65వ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 20.**తాడేపల్లిగూడెం పట్టణంలో.. స్థానిక ఎస్వీఆర్ సర్కిల్ వద్ద... తాడేపల్లిగూడెం దివ్యాంగుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో
65వ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఏర్పాటు చేశారు.
ముఖ్యఅతిథిగా పాల్గొన్నా
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ఈ సందర్భంగా కమిటీ సభ్యులుగొర్రెల శ్రీధర్ శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేసి, సన్మానించారు.
ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మీలో ఒకడిగా ఒక సోదరభావంగా నన్ను ఆహ్వానించి మీ యొక్క కష్ట,సుఖాల్లో నన్ను పాలుపంచుకునేలా చేసినటువంటి దివ్యాంగుల సోదర సోదరీమణులందరికీ కూడా పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ రానున్న కాలంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా నన్ను సంప్రదించండి అని హామీ ఇచ్చారు. జరిగినటువంటి సభకు విచ్చేసినటువంటి దివ్యాంగుల సోదర, సోదరీమణులందరికీ కూడా భోజన ఏర్పాట్లు స్వయంగా శ్రీధర్ గారు ఏర్పాటు చేయడం పాటు స్వయంగా వడ్డించారు.

## మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి భాధ్యత.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 20.** ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ మనుషుల అక్రమ రవాణా పైన అవగాహనా కార్యక్రమం తాడేపల్లెగూడెం ఎంపిడిఓ భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం ను ఉద్దేశించి ఎంపీడీవో చంద్రశేఖర్ మరియు డిప్యూటీ ఎంపిడిఒ వాణి మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచం లోనే అతి పెద్ద నేరం అన్నారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీనికి గురి అవుతున్నారు. ప్రతి ఒక్కరు దీని పైన అవగాహనా కలిగి ఉండాలని ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికీ అవగాహనా కల్పించి రక్షించాలని అన్నారు. ఈ అక్రమ రవాణాకు లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 29 సంవత్సరాలుగా పద్మ డాక్టర్. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయముతో ఇప్పటి వరకు 30500 మంది అమ్మాయిలను మహిళలను కాపాడి వారికీ కల్పించడం పునరావాసం జరిగిందని తెలిపారు. ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిథాలీరాజ్ మాట్లాడుతూ సమాజం లో జరుగుతున్న అక్రమ రవాణా ను అరికట్టడం లో అందరు భాగస్వామ్యం కావాలి అని . ప్రతి గ్రామలలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూప్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమతంగా ఉంటారని అన్నారు. అక్రమ రవాణాకు గురి అయినా పిల్లలను శ్రమ దోపిడీ, అవయవాల దోపిడీ లైంగిక దోపిడీకి అమ్ముతున్నారని తెలిపారు. నేటి కాలంలో యువత మొబైల్ ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారని తెలిపారు. అనుమానస్పద వ్యక్తుల నుండి మెసేజ్ గాని కాల్స్ గాని వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని గురి అయినా సందర్భాలలో 1930, 181, 1098, 100 అనే టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలి అని అన్నారు. మనకు ఉన్న చట్టాలు వాటిని ఎలా ఉపయోగించాలి అని టీచర్లకి లఘు చిత్రల ద్వారా అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీఓ వాణి, ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్లు అనిల్ కుమార్ మరియు మిథాలిరాజ్, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే బొలిశెట్టి.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 20.**దివ్యాంగుల కు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్వీఆర్ సర్కిల్లో శనివారం 65 వ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు విభిన్నమైన ప్రతిభ, నైపుణ్యాలను కలిగి ఉంటారని అందుకు అనుగుణమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలియజేశారు. దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరు హృదయ పూర్వకంగా మెలగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో



కూటమి నాయకులు, నియోజకవర్గ దివ్యాంగులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో "ముస్తాబు" ప్రారంభం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 20**
గిరిజన సంక్షేమ శాఖ డీ.డీ ఎడ్యుకేషన్ (అడాప్షన్ ఆఫీసర్) ఎం. కమల, డీడీ
నగరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎంఎస్ గర్ల్స్ హాస్టల్ – 1, , పీఎంఎస్ గర్ల్స్ హాస్టల్ – 2, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, "ముస్తాబు" కార్యక్రమాన్ని శనివారం గిరిజన సంక్షేమ శాఖ డీ.డీ ఎడ్యుకేషన్ (అడాప్షన్ ఆఫీసర్) ఎం. కమల ప్రారంభించారు. అనంతరం పీఎంఎస్ గర్ల్స్ హాస్టల్ – 2, రాజమహేంద్రవరం , ఆశ్రమ పాఠశాల, బొమ్మూరు లను తనిఖీ నిర్వహించి, పీఎంఎస్ గర్ల్స్ హాస్టల్ – 2లో నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినుల కోసం అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక అమలును పరిశీలించి, ఉత్తమ విద్యా ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థినులు చక్కని ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.
పాఠశాల టాయిలెట్లలో పరిశుభ్రత మెరుగుపరచాలని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. ఇందిరా ప్రియదర్శిని కి సూచించారు.
మూడు హాస్టళ్లలో విద్యార్థినులతో సమావేశమై "ముస్తాబు" కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంను వివరించి, పరిశుభ్రతను పాటించాలని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, క్రాంతి, త్రివేణి, లక్ష్మణ్, శ్రీనివాస్, సూర్యం, ఆశ్రమ పాఠశాల బొమ్మూరు ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎం. ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో జనసేన అనుచరులు అరాచకం

- గౌరవ వైస్ ఛాన్స్ లర్ ను ప్రశ్నించే హెూదా బత్తుల వెంకటలక్ష్మికి ఎక్కడిది ?
- అరాచక శక్తిగా మారిన బత్తులపై అధిష్టానం చర్యలు తీసుకోవాలి
- మీడియా సమావేశంలో బత్తుల తీరుపై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 20:**చదువుల తల్లి నిలయమై, పవిత్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యా శాఖ మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా జరిగిన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామక ృష?, అతని సతీమణి వెంకటలక్ష్మి , అతని అనుచరులు ఫ్లెక్సీ వివాదం లో వ్యవహరించిన అరాచకాన్ని ఖండించారు. స్థానిక స్వగ ృహములో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 8వ తరగతి ఫెయిల్ అయిన బత్తుల నేరచరిత్ర తెలిసి కూడా ఎమ్మెల్యే సీటు ఇచ్చిన జనసేన పార్టీ అదిస్థానమే ఈ సంఘటనకు బాధ్యత వహించాలన్నారు.
జగన్ ప్రభుత్వ హయాంలోనే యూనివర్సిటీలో కోట్ల రూపాయలతో అభివ ృద్ధి పనులు, భవనాలను నిర్మించామన్నారు. కూటమి పార్టీల సూర్తికి విరుద్ధంగా మంత్రి పర్యటనలో ఉన్నామనే జ్ఞానం విస్మరించి , విద్యాలయంలో జనసేన కార్యకర్తలు బూతులతో వీరంగం చేయడం వెనుక ఎమ్మెల్యే ప్రోత్సాహం ఉందని ఆరోపించారు. విద్యాలయ చట్టప్రకారం విద్యాలయాల్లో రాజకీయాలు చేయకూడదని , ఉన్నత చదువులు చదివి గౌరవ వైస్ చాన్సులర్ గా ఎదిగిన ఎస్టీ సామాజిక వర్గం మహిళను కించపరుస్తూ దూషించడం,
బెదిరించడం దౌర్జన్యానికి దిగిన నిందితులపై ప్రభుత్వం కేసు నమోదు చేసి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. బత్తుల వెంకటలక్ష్మికి ఏ హెూదా ఉండి వి.సి ని నిలదీశారని జక్కంపూడి ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసి చీటింగ్ కేసులు ఉండడమే హెూదా గా భావించారామో అని జక్కంపూడి ఎద్దేవా చేశారు. పైగా వి సీ అటెండర్ చరణ్ తిరిగి దాడి చేసినట్లుగా కట్టుకథలు అల్లడాన్ని విమర్శించారు. నియోజక వర్గంలో ఎమ్మెల్యే బత్తుల మట్టి,ఇసుక , మద్యం మాఫీయాల్లో పాత్ర ఉందని ఆరోపించారు. పై స్థాయిలో కూటమి ప్రభుత్వ పెద్దలు రెండు బుక్ రాజ్యాంగం అంటూ విర్ర వీగుతున్నారని క్రింది స్థాయిలోను కుటమి నాయకులు బరితెగిస్తూ సమాజానికి ప్రమాదకరంగా మారారన్నారు. నియోజవర్గ ప్రజలకు, విశ్వవిద్యాలయం అధికారులకు విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని . ఇటువంటి అరాచక శక్తులపై కుటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మానసిక ప్రశాంతతకు ధ్యాన సాధనే మార్గం

- బ్రహ్మకుమారి స్వరూప




**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 20 :**స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో కాకినాడ బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ ,పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు. "ప్రపంచ శాంతి సాధనకై ధ్యానం" అనే నేపథ్యంతో ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించాలనే నిర?యం తీసుకున్న నేపథ్యంలో,కళాశాల అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బందికి ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ,మానసిక మరియు శారీరక సామర్థ్యాన్ని పెంపొందించి గొప్ప వ్యక్తిత్వాన్ని నిర్మించడానికి యోగాను మించిన సాధన మరొకటి లేదని అన్నారు. లక్ష్యసాధనకు, మానసిక స్థిరత్వానికి ధ్యానం ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రహ్మకుమారి రాజయోగ ట్రైనర్ బి.కే.స్వరూప మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి దినచర్యలో ధ్యానం తప్పనిసరిగా భాగంగా ఉండాలని అన్నారు. ఏకభావ ప్రవాహ రూప జ్ఞానమే ధ్యానమని యోగసూత్రాన్ని వివరిస్తూ,మనస్సును వ ృత్తులు,కోరికలు,భావాలు మరియు చెలించించే విషయాల నుంచి విముక్తం చేయడమే ధ్యానమని పేర్కొన్నారు. ధ్యానం యొక్క పరమ లక్ష్యం తనను తాను తెలుసుకోవడమేనని తెలిపారు. అనంతరం కళాశాల అధ్యా పకులతో అంతర్మౌన ధ్యాన అభ్యాసం చేపట్టారు. మానసిక ప్రశాంతతకు ధ్యాన సాధనే మార్గమని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బ ృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించి ధ్యాన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టీ. తేజేశ్వరరావు, డి. అశ్విని తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## కుయ్యేరు సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కుయ్యేరు, పెన్ పవర్,డిసెంబర్ 20:**33/11 కేవీ కుయ్యేరు సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్ (కుయ్యేరు నుండి కాజులూరు) ఏర్పాటు పనుల కారణంగా డిసెంబర్ 21 ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా దుగ్గుదురు, దుగ్గుదుర్రుపాటి, మెకలగరువు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, చింతల్లంక, రేగుబడవ గ్రామాలకు, ఆక్వా సర్వీసులకు, అలాగే 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని పల్లిపాలెం, ఐతపూడి ఇండస్ట్రియల్ ప్రాంతం మరియు ఆక్వా సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.విద్యుత్ మౌలిక వసతుల అభివ ృద్ధి పనులకు వినియోగదారులు సహకరించాలని ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ ఎలక్ట్రికల్ ఆపరేషన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ కోరారు.

# పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనిషా



కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 20:కాకినాడ నగరంలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనిషా శనివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణతో కలిసి రేచర్లపేట ప్రాంతంలో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు.శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ మనిషా నగరంలో రోజువారీగా చేపడుతున్న పారిశుధ్య పనులు, డ్రైనేజీ శుభ్రపరిచే విధానం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన పొందారు.నగరంలో ప్రతిరోజు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలపై హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్ ఆమెకు వివరించారు.అనం తరం డైరీ ఫార్మ్ సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్ను ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సందర్శించారు.అన్న క్యాంటీన్ నిర్వహణ విధానం,అందిస్తున్న సేవలపై ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ వివరించారు.ఈ పర్యటనలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు సుదర్శన్, దుర్గారావు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యాలయాల్లో రాజకీయ అరాచకాలకు పాల్పడడం దారుణం

- తెలుగుదేశం పార్టీకి బోయలుగా మారిన జనసేన కార్యకర్తలు
- తెలుగుదేశానికి కాపు జాతి ని తాకట్టు పెడుతున్న పవన్ కళ్యాణ్
- మీడియాలో మాజీ ఎంపీ భరత్ విమర్శలు




రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 20:పవిత్రమైన విద్యాలయాల్లో అరాచక రాజకీయాలు చేయడం తగదని, విద్యామంత్రి లోకేష్ పర్యటలో భాగంగా నన్నయ విశ్వవిద్యాలయంలో జనసేన కార్యకర్తలు చేసిన అరాచకాన్ని మాజీ ఎంపీ, వై సీపీ జాతీయ అధికార ప్రతినిధి భరత్ రామ్ ఖండించారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నన్నయ విశ్వవిద్యాలయాన్ని స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్థాపించారని, ఆ తర్వాత జగన్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి తన శాఖ పరంగా చేసిన ఘనమైన పనులు ఉంటే చెప్పాలన్నారు. గత ఐదేళ్లలో తాము చేసిన ప్రాజెక్టులనే లోకేష్ ప్రారంభించారన్నారు అయితే గత ఐదేళ్లు విశ్వవిద్యాలయంలో ఏ రోజు రాజకీయాలు చేయలేదని , విద్యార్థులను అధ్యాపకులను దూషించలేదని, దౌర్జన్యాలకు దిగలేదని అన్నారు. ఎమ్మెల్యే బత్తుల సమక్షంలోనే జనసేన పార్టీ అనుచరులు వి.సీ పై దౌర్జన్యం చేయడం రౌడీయిజం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుందన్నారు. తెలుగుదేశం పార్టీకి జనసేన పార్టీ కార్యకర్తలు బోయలుగా మారారని, కాపు జాతిని పవన్ కళ్యాణ్ తెలుగుదేశానికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. మరో 15 ఏళ్లు తరువాత తాను ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పడం నిదర్శనం అన్నారు. కుటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం పేదవారికి వైద్య విద్యను, వైద్యాన్ని దూరం చేయడమే అన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో నే వైద్య విద్య ఫీజులు తగ్గాయని అన్నారు. నగరంలో గత ఐదేళ్లలోనే అభివృద్ధి సాధించిందని, గత సంవత్సరన్నరకాలంలో తాను చేసిన అభివృద్ధి పనులకే రిబ్బన్లు కటింగ్ చేసుకుంటూ ప్రారంభోత్సవాలు జరుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నగరంలో ఈవీఎం ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే హింస ప్రవృత్తి, పెరిగిపోయిందని రౌడీయిజం గూండాయిజం బ్లేడ్ బ్యాచ్లు పెరిగిపోయాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల హాస్టల్ మైనర్ బాలికను ఒక రౌడీషీటర్ అత్యాచారం చేసిన ఘటన ఇందుకు నిదర్శనమన్నారు.

# ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి - సిఐ విద్యాసాగర్



ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 20:ద్విచక్ర వాహనాలు నడిపేవారు భద్రతను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రావులపాలెం రూరల్ సిఐ సి.హెచ్.విద్యాసాగర్ అన్నారు. శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి, కొత్తపేట ప్రాంతాల్లో ఎస్సైలు ఎస్.రాము, జి.సురేంద్రలతో కలిసి వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాల్లో 70 శాతం ద్విచక్ర వాహనాల ప్రమాదాలేనని, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణనష్టం జరుగుతోందని సిఐ తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

హెల్మెట్ ధరించకుండా పట్టుబడితే రూ.1000 జరిమానా విధిస్తామని, తక్కువ ఖర్చుతో నాణ్యమైన హెల్మెట్ కొనుగోలు చేసి వినియోగిస్తే భద్రతతో పాటు ఫైన్ తప్పుతుందని సూచించారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించామని, ఇకపై హెల్మెట్ నిబంధనలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

# నేడు పల్స్ పోలియో కార్యక్రమం




తాళ్లపూడి, పెన్ పవర్, డిసెంబర్ 20:ఈ నెల 21వ తేదీ ఆదివారం జరిగే జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.పి.అన్నపూర్ణ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరముల లోపు పిల్లలు అందరు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించుకోవాలని, తద్వారా పోలియో వ్యాధి రాకుండా చూడవచ్చని తెలిపారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 6 సచివాలయాలలో 2417 మంది పిల్లలకు, 20 పోలియో చుక్కల కేంద్రాలు, ఒక మొబైల్ వాహనం ద్వారా వేయటానికి ఏర్పాట్లు చేయటం జరిగిందని అన్నారు. మొదటి రోజు వేయించుకోకుండా మిగిలిన పిల్లలకు రెండవ, మూడవ రోజులలో మా సిబ్బంది ఇంటింటికి తిరిగి వేయటం జరుగుతుందని తెలిపారు. కనుక తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మీ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి, మీ చిన్నారులు పోలియో బారిన పడకుండా చూడాలని చెప్పారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో మీ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.పి.సుచందన ఎమ్.పి.హెచ్.ఈ.ఓ ఎస్.రమేష్, హెల్త్ సూపర్వైజర్ బి.కృపావారం, పి.హెచ్.ఎన్ ఎమ్.వేదకుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదేవరపేట గవర్నమెంట్ హైస్కూల్లో కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం



తాళ్లపూడి, పెన్ పవర్, డిసెంబర్ 20:మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదేవరపేట హై స్కూల్లో జరిగిన కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాంలో భాగంగా పిల్లలకు నైతిక విలువలు, దేశభక్తి, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాల గురించి వివరించారు. అనంతం సాయి రెండు గంటల పాటు పిల్లలకు చక్కని సందేశం అందించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆశయాలను పిల్లలకు సంస్థ అధ్యక్షులు వెలుగుబంటి శ్రీనివాస్ తెలియజేశారు. విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. 120 మంది విద్యార్థిని విద్యార్థులకు ఫైల్, దేశ నాయకులు పురాణ పురుషులు ఉన్న స్టిక్కర్స్ అందజేశారు. అనంతం సాయి పిల్లలకు మోటివేషన్ క్లాస్ చెప్పడమే కాకుండా పిల్లలకు పెన్నులను అందజేశారు. వెలుగుబంటి శ్రీనివాస్ స్కూల్ లైబ్రరీకి కొన్ని బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, సంస్థ రీజనల్ చైర్మన్ చంద్రయ్య, ఇంజరపు అబ్బు, గెడ్డం సాయిబాబా, బారనాల శంకర్, వెలుగుబంటి రఘు కిషోర్, కూచిపూడి గణపతి కృష్ణ, మానవత బాధ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# జిల్లా స్థాయి విద్యా - వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా నిర్వహణ



## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలి - ప్రజాప్రతినిధుల పిలుపు

కాకినాడ,పెన్ పవర్, డిసెంబర్ 20:జిల్లా స్థాయి విద్యా – వైజ్ఞానిక ప్రదర్శన స్థానిక సాలిపేట కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా విద్యా శాఖాధికారి పి. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని కాకినాడ స్మార్ట్ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ,రాష్ట్రంలోనే కాకినాడ జిల్లా విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవాల న్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. అందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తానని హామీ ఇవ్వడంతో పాటు విద్యార్థులు,ఉపాధ్యాయులను ఆయన ప్రోత్సహించారు.జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో విద్యార్థులను సైన్స్ పట్ల ఆసక్తి కలిగేలా బోధిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో ఉపాధ్యా యుల పాత్ర కీలకమని ఆయన అన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ జిల్లా సైన్స్ రిపోర్టును సభకు సమర్పించారు. కాకినాడ డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కె.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని నవీన ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ, "చిట్టి బుర్రలే భవిష్యత్ ఆవిష్కరణలకు నెలవులు" అని పేర్కొన్నారు.ఈ స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యా యులను, జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలపడానికి కృషి చేస్తున్న జిల్లా సైన్స్ అధికారి వినీల్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ సత్యనారాయణ,జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన అధ్యాపకులు,సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మీకు కావాలంటేఇంకా సంక్షిప్త వార్త,రెండు కాలమ్స్‌కు సరిపోయే పత్రిక వెర్షన్,లేదా హెడ్డింగ్‌కు ప్రత్యామ్నాయాలు కూడా సిద్ధం చేస్తాను.

# శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు




పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 20 : వరి, మొక్కజొన్న, మినుము తదితర పంటల సాగులో ప్రణాళికాబద్ధంగా శాస్త్రీయ పద్ధతులు ఆచరిస్తే, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం వ్యవసాయ పరిశోధనాస్థానం అధిపతి డాక్టర్ ఎం. రామభద్రరాజు అన్నారు. శనివారం నిర్వహించిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో భాగంగా రాబోయే నెల రోజుల్లో పలు పంటలలో చేపట్టాల్సిన వ్యవసాయ కార్యక్రమాలు ఆయన వివరించారు. వరిలో దోమ, ఎండాకు తెగులు ఉధృతి పట్ల అప్రమత్తంగా ఉండాలని, సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో వరి పంట ప్రస్తుతం నారుమడి దశలో ఉండి కాండం తొలచు పురుగు ఆశించిందని వాటి నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా క్లోరాంట్రనిలిప్రోల్ 0.30 మి.లీ/ లీటరు నీటికి కలిపి చొప్పున పిచికారి చేయాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు మాట్లాడుతూ ప్రస్తుత దాళ్వాకు కావలసిన సిఫారసులో ఉన్న వరి, మినుము, పెసర, శెనగ విత్తనాల వివరాలు తెలిపారు. అనంతరం, అధికారులు అడిగిన పలు సందేహాలకు శాస్త్రవేత్తలు పరిష్కార మార్గాలను సూచించారు. అనంతరం క్షేత్ర సందర్శనలో భాగంగా పరిశోధన స్థానంలో గల మొక్కజొన్న, అపరాలు, చిరుధాన్యాల పంటలను అధికారులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, పలు జిల్లాలకు చెందిన అధికారులు మాలకొండయ్య, సూర్య రమేష్, జయరామలక్ష్మి, దైవకుమార్, శ్రీనివాస్, శశిబిందు, డాక్టర్ జానకి, తదితరులు పాల్గొన్నారు.

# కూనవరం ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణ




కూనవరం,పెన్ పవర్,డిసెంబర్ 20.వై రామవరం మండలం పోలీస్ స్టేషన్ నుండి బదిలీ పై బొడ్డు రామకృష్ణ ఎస్సైగా కూనవరం పోలీస్ స్టేషన్లో శనివారం నాడు బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ లలిత శ్రీ పాడేరు మహిళా పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎటువంటి భంగం కలిగిన కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు.ద్విచక్ర వాహనాలపై యువత లైసెన్స్ లేకుండా అతివేగం,త్రిబుల్ డ్రైవింగ్ చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని,తల్లిదండ్రులను స్టేషన్ కు పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామని అన్నారు.ఆటోలపై పరిమితికి మించి ఎక్కించుకొని తోలినట్లయితే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

# స్వచ్ఛ ఆంధ్ర ప్రతి ఒక్కరి బాధ్యత.

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.



తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 20 :ఆంధ్ర రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కాలువలు స్వచ్ఛంగా ఉండాలని స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం నెరవేరడానికి ప్రతి పౌరుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బోలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ వద్ద నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులు మరియు నియోజకవర్గ ప్రజలు కాలువలను శుభ్రంగా ఉంచిన నాడే స్వచ్ఛ దివస్ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. దీనికిగాను ప్రతి ఒక్కరు వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తలపెట్టిన ఈ మహత్తర కార్యక్రమానికి ప్రజలు చేతులు కలిగి ముందుకు నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 20 : పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,40,560, అన్నదాన విరాళాల ద్వారా రూ. 58,652, కేశ ఖండన ద్వారా రూ. 3,080 తులాభారం ద్వారా రూ. 100, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 16,860 మొత్తం రూ. 2,19,252 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు మూడు వేల రెండు వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ మొయిళ్ళ సంధ్య, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నీటి వనరులపై ఆక్రమణల తొలగింపుకు ప్రణాళికాబద్ధ చర్యలు

- వాటర్ బాడీస్ పరిరక్షణకు శాఖల సమన్వయం అవసరం
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్




**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 20:**జిల్లాలోని నీటి వనరులకు సంబంధించిన పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ పరిధిలోని కాలువలు, చెరువులు, డ్రైన్స్‌లపై ఉన్న ఆక్రమణలను గుర్తించి ప్రణాళిక ప్రకారం తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.

శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ మానీషాతో కలిసి వాచ్‌డాగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వాటర్ బాడీలపై ఉన్న ఆక్రమణల వివరాలపై రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, ఇరిగేషన్, డ్రైన్స్ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నీటి వనరులను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా కాలువలు, చెరువులు, డ్రైన్స్‌లపై ఉన్న ఆక్రమణలను తప్పనిసరిగా తొలగించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు జిల్లాలోని అన్ని వాటర్ బాడీలపై ఉన్న ఆక్రమణలను సమగ్రంగా గుర్తించాలని, గుర్తించిన వాటిని ప్రణాళికాబద్ధంగా తొలగించేందుకు ప్రతి నెల లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలని ఆదేశించారు.ఈ ప్రక్రియలో రెవెన్యూ,ఇరిగేషన్,మున్సిపల్, పంచాయతీ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు.అలాగే కాలువలు,చెరువులు,డ్రైనేజీలలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూటు,గుర్రపు డెక్కతో పాటు ఇతర చెత్తను తొలగించేందుకు సమర్థవంతమైన పరిష్కార మార్గాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు, జిల్లా పంచాయతీ అధికారి వి. రవికుమార్, ఇరిగేషన్ ఎస్.ఈ కె. గోపినాథ్, పీసీబీ ఈఈ ఎం.శంకరరావు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, డ్రైన్స్ ఈఈ కిషోర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వెనకబడిన తరగతుల వసతి గృహాల్లో 'ముస్తాబు' కార్యక్రమం ప్రారంభం

- వ్యక్తిగత-పరిసరాల పరిశుభ్రతతోనే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం- జి. శ్రీనివాసరావు




**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 20:**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్ర మమైన 'ముస్తాబు' ప్రోగ్రామ్‌ను కాకినాడ జిల్లాలోని అన్ని వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ వసతి గృహాల్లో శనివారం ఉదయం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కాకినాడ జగన్నాధపురంలోని బాలికల కళాశాల వసతి గృహంలో నిర్వహించిన ముస్తాబు కార్యక్రమంలో ఉపసంచాలకులు (ఎఫ్ఏసీ) జి. శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ముస్తాబు ఒక్కరోజు కార్యక్రమం కాదని, ప్రతిరోజూ విద్యార్థులు పాటించేలా దీన్ని అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు.అలాగే వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బందికి కూడా ఈ అంశంపై అవగాహన కల్పిస్తూ, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సహాయ వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి, వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయంలో విజయవంతంగా ముగిసినా 5 రోజుల వర్క్ షాప్



**గండేపల్లి, పెన్ పవర్ డిసెంబర్ ,20:**ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఫోరెన్సిక్ విభాగంలో నిర్వహించిన ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసింది. ఆదిత్య విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ పి. రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై నిరంతర ఫ్యాకల్టీ అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను గురించి వివరంగా తెలియజేసారు . మరియు 'థర్డ్ ఐ టెక్నో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషకుడు బి నవీన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేట్ డీన్వి లాస్ అనిల్ చవాన్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. వి. నాగేశ్వరరావు హాజరై కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి దోహదపడ్డారు. విలాస్ అనిల్ చవాన్ మాట్లాడుతు, ఫ్యాకల్టీ సభ్యులు చురుకుగా పాల్గొని,వర్క్ షాప్ ను అర్థవంతమైన మరియు విజయవంతమైన విద్యా కార్యక్రమంగా మార్చారు అని అన్నారు.

## బత్తుల వెంకటలక్ష్మిని బొడ్డు పరామర్శ..



**కోరుకొండ, పెన్ పవర్, డిసెంబర్ 20:** రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మిని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు రాజానగరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రుడా చైర్మన్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి పరామర్శించారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి శుక్రవారం నన్నయ యూనివర్సిటీలో జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, బూరుగుపూడి సొసైటీ చైర్మన్ కంటే కేశవరావు, జనసేన నాయకులు అడపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నగరం లో మాజీ ప్రధాని వాజ్ పాయ్ విగ్రహాం ఆవిష్కరణ




ముఖ్య అతిథిగా ఛత్తీస్గఢ్ ముఖ్యమంత్రి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 20**:దేశ మాజీ ప్రధాని వాజ్ పాయ్ కాంస్య విగ్రహాం ఆదివారం నగరంలోని జాగృతి బ్లడ్ బ్యాంక్ జంక్షన్లో ఆవిష్కరిస్తామని, బీజేపీ పతకం ఏర్పాటు చేశామని చేసామని బిజెపి ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఛత్తీస్గఢ్ ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

వాజ్పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని 20 జిల్లాలలో వాజ్ పాయ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలు జరుగుతున్నాయిన్నారు.

21వ తేదీన ఉదయం కాకినాడలోనూ, సాయంత్రం రాజమండ్రి లోను , 22 వ తేదీన భీమవరం లో ఉదయం సాయంత్రం ఏలూరులోను, 25 వ తేదీన అమరావతిలో 2 ఎకరాల భూమిలో వాజపేయి స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తో పాటు కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా వచ్చే అవకాశం ఉందన్నారు.

ఈ కార్యక్రమానికి ముగ్గురు ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు, బీజేపీ, రాష్ట్ర మంత్రులు,ఎంపీ, 7 ఎమ్మెల్యే లు , కార్పొరేషన్ చైర్మన్లు, పాల్గొంటారన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో వాజ్ పాయ్ విగ్రహాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ నీ తీర్చిదిద్దారన్నారు. అవినీతి అంతమొం దించడానికి నూతన పార్టీ గుర్తుగా కమలం ఎంపిక చేసుకున్నామన్నారు. బురద తో కూడిన రాజకీయాల్లోంచి ఉద్భవించినది కమలంమన్నారు. ప్రధానిగా వాజ్ పాయ్ దేశంలో మౌలికమైన మార్పులు చేశారని, ప్రధానంగా పోక్రాన్ అణు పరీక్ష నిర్వహించి ప్రపంచ దేశాల సరసన భారత దేశాన్ని వాజపేయి నిలబెట్టారన్నారు. వాజ్ పాయ్ వచ్చిన తర్వాత ప్రైవేట్ ఫోన్ ప్రోత్సహించారని,

మధ్యహన భోజనం పథకం, పిల్లలకు యూనిఫాం, ఎంబీబీఎస్ కళాశాలలు, రూరల్ , అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయించారన్నారు. వాజ్ పాయ్ విధానం ఒక దార్శనికత, ఆలోచనలు ప్రజలకు తెలపాలన్నదే తమ సంకల్పంతో విగ్రహాలు ఆవిష్కరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## జాలిపూడి గ్రామంలో స్వచ్ఛ్ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం

**ఏలూరు డిసెంబర్ 20 పెన్ పవర్** : స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ-దివాస్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రజల ఇళ్ల వద్ద నుండి పంచాయతీ సిబ్బంది చర్చ సేకరణ కార్యక్రమ నిర్వహణ తీరును మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగరాజు కుమారి, డిప్యూటీ ఎంపీడీవో డి శ్రీనివాసులు పర్యవేక్షణలో, పంచాయతీ ఉపసర్పంచ్ దాసరి నరసింహారావు నేతృత్వంలో పర్యవేక్షించారు. గ్రామంలో అన్ని వీధులలో చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. ట్రైన్లను శుభ్రపరచి సిల్టును తొలగింపజేశారు. ప్రతిరోజు చెత్త సేకరించే వాహనం వస్తుందా? ఎన్ని బుట్టలతో చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందిస్తున్నారు అనే విషయాన్ని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదర్శనలు చేయకుండా ఈ గవర్నెన్స్ ను అందుబాటులోకి తెచ్చిందని, చరవాణిని ఉపయోగించి నేరుగా 161 సేవలను పొందవచ్చు అన్నారు. అదేవిధంగా ఫిర్యాదు దారుడు తాను చేసిన ఫిర్యాదు స్థాయిని తెలుసుకోవచ్చన్నారు. దేవాదాయ, సీఎం ఆర్డి, విద్యుత్, రెవెన్యూ సేవలను పొంగవచ్చని, తమ సమస్యల పరిష్కారం కోసం ఈ విధానం సులభతరం అవుతుందన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ ఉప సర్పంచ్ దాసరి నరసింహారావు మాట్లాడుతూ ప్రజలు, నాయకులు, చొరవ చూపితే గ్రామం సంపద కేంద్రం లో సంపద సృష్టించడం జరుగుతుందన్నారు. శాసనసభ్యులు చింతమనేని




ప్రభాకర్ హయాంలో గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి సంపద కేంద్రాన్ని నిర్మించడం జరిగిందన్నారు. గ్రామంలో ఇళ్లల్లో తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అజెంకే విషయంలో పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం హరిత రాయబారులను నియమించిందని, కృత్రిమ ఎరువుల తయారీకి ఎంచరాలను సమకూర్చిందని, సేకరించిన తడి పొడి చెత్త నుండి వర్మి కంపోస్ట్ తయారు చేసే రైతులకు విక్రయించి సంపద సృష్టించేందుకు కోటమీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జాలిపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ దాసరి నాగమల్లేశ్వరి, ఉపాధ్యక్షుడు గండికోట నారాయణ, కార్యదర్శి సీతారామయ్య, కోశాధికారి ఆర్టగడ్డ సత్యవతి, సహాయ కార్యదర్శి ఎం వెంకట రాజారావు, కమిటీ సభ్యులు ఆర్ రవి, బండి దుర్గాప్రసాద్, గుళ్ళపల్లి వాసు, ఆర్ సురేష్, తుపాకుల నాగరాజు, తిరుపతి రంగారావు, తోట ధర్మారావు, ఆర్. కనక సింహాచలం, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పాయం



-బిజెపి నాయకులు హర్షం

**కూనవరం,పెన్ పవర్,డిసెంబర్ 20.**నిరంతరం ప్రజా సేవలో ఉంటూ ఏజెన్సీలో నాలుగు సంవత్సరాలుగా గిరిజన,గిరిజనేతర ప్రజల కోసం అహర్నిషలు పూర్తి చేస్తున్న మాజీ ఎంపీపీ పాయం వెంకయ్య కు గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించడం పట్ల బీజేపీ నాయకులు కారం దారయ్య, బిజెపి మండల ప్రెసిడెంట్ కరక పవన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం పాటుపడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలను ఎప్పటికప్పుడు అధిష్టానానికి తెలుపుతూ,బిజెపి పార్టీ ద్వారా ప్రజల అభివృద్ధికి,పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సీమడబోయిన వెంకన్న, పునుగుపాటి ఏసుకుమార్,కోవాల రాజా పాల్గొన్నారు.

## ఉత్సాహంగా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర




**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 20 :** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛతను కాపాడటం మన అందరి బాధ్యత అని ఎంపీడీవో కె.వి.సూర్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణ, సిబ్బందితో కలిసి కార్యాలయంలోని పరిసరాలను శుభ్రం చేసి ఆవరణలో ఉన్న వ్యర్థాలను, చెత్తను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం మండల పరిధిలో అన్ని గ్రామాల్లో సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పర్యావరణంలో అవకాశాలు - స్వయం ఉపాధి వ్యవస్థాపకత, పర్యావరణ రంగంలో అవకాశాలు అనే ప్రత్యేక అంశంతో ఈనెల స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం ఆయన అందరిచేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.వి.శేఖర్ రెడ్డి, కార్యాలయ ఏవో ఎం. సత్యనారాయణమూర్తి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.ద

## చిన్న వెంకన్న సేవలో ఎమ్మెల్యే మద్ది పాటి



**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 20.** నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల(చిన్న తిరుపతి) లో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు, పెన్పేర్ సంస్థ అధ్యక్షులు ఘంటా మధు కృష్ణ, చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షులు గద్దె హరిబాబు, కాకర్ల జగదీష్ తదితరులు శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బృందానికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రాల ఉచ్చరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజానీకం ఆయురారోగ్యాలు, సుఖశాంతులు తో ఉండాలని, కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలని కోరుకున్నట్లు తెలిపారు.

## జువనైల్ జస్టిస్ చట్టం, నల్సా పిల్లలకు సేవల పథకం పై శిక్షణ న్యాయ సదస్సు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 20:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎన్. శ్రీలక్ష్మి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం జువనైల్ జస్టిస్ చట్టం - 2015 నల్సా (పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు) పథకం - 2024"లిలిపై శిక్షణ, న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు.

అనంతరం కోర్టు ఆవరణలో డెంటల్ క్యాంపును ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత మాట్లాడుతూ, జువనైల్‌లతో వ్యవహరించాల్సిన విధానం, వారి హక్కులు, జువనైల్‌కు సంబంధించిన వివిధ చట్టాలపై అవగాహన కలిగించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, పిల్లల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడటం, మోసపూరితంగా అక్రమ కార్యకలాపాలకు వినియోగిస్తున్న ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు.

"నల్సా (పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు) పథకం%-%2024" ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పిల్లలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవల వివరాలను తెలియజేశారు. న్యాయ సంబంధిత సలహాలు, సూచనల కోసం టోల్ ఫ్రీ నంబరు 15100కు కాల్ చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి సి. రమ్య, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు, జువనైల్ జస్టిస్ బోర్డు సభ్యులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

### జగన్ పుట్టినరోజు వేడుకలకు జనం తరలి రావాలి. శ్రీరామమూర్తి

**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 20.** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం జరగనున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో గోపాలపురంలో జరిగే ఈ వేడుకలకు ఆ పార్టీ నాయకులు తరాల రావాలని అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తానేటి వనిత హాజరవుతారు అన్నారు. పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్, మిఠాయిలు పంపిణీ అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ వేడుకలకు మండలంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, అభిమానులు, వివిధ విభాగాల అధ్యక్షులు తరలిరావాలని శ్రీరామ మూర్తి కోరారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com